ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ లో
మీకు నిజం రాసే ధైర్యం ఉందా?
అందుకు
వార్త సంధ్య మీ వేదిక!
రండి — ప్రజల గళంగా,
నిజం కోసం మాతో కలవండి.
ఇప్పుడే రిపోర్టర్ గా చేరండి
vaarthasandhya@gmail.com



RNI TGTEL/25/A5065

vaartha sandhya

# వార్త సంధ్య

తెలుగు దిన పత్రిక

నిజం నిర్భయంగా మీ ముందుకు





SEGGEM KIRAN KUMAR
EDITOR & MD
VAARTHA SANDHYA , CM NEWS TV

Published From : Rangareddy e - paper.vaarthasandhya.com సంపుటి : 01 సంచిక : 200 బుధవారం 08 - 07 - 2026 ఎడిటర్ : సెగ్గెం కిరణ్ కుమార్ పేజీలు : 08 వెల : 6/-




Published From : Rangareddy e - paper.vaarthasandhya.com VOLUME : 01 Issue : 200 Wednesday 08 - 07 - 2026 Editor : Seggem Kiran Kumar Pages : 08 Price : 6/-


## హైదరాబాద్‌లో లక్ష ఇందిరమ్మ

# ఇళ్లు కట్టి పేదలకు అందిస్తాం

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- హైదరాబాద్‌లోని నాచారంలో బాలామృతం ప్లాంటు ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి
- బాలామృతం ప్లాంటు నాలుగైదు రాష్ట్రాలకు సరఫరా చేసేలా అభివృద్ధి చెందుతుందని వెల్లడి
- ఉప్పల్‌ను అభివృద్ధి చేస్తామని హామీ
- ఏటా రూ.25 వేల కోట్లు విద్య కోసం ఖర్చు చేస్తున్నామన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- నర్సరీ నుంచి 12వ తరగతి వరకు అల్పాహారం, నాణ్యమైన భోజనం



**వార్త సంధ్య, హైదరాబాద్, జులై 07 :** నాచారంలో ఏర్పాటు చేసిన బాలామృతం ప్లాంటు నాలుగైదు రాష్ట్రాలకు సరఫరా చేసేలా అభివృద్ధి చెందుతుందని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. హైదరాబాద్‌లోని నాచారంలో బాలామృతం ప్లాంటు సీఎం ప్రారంభించిన అక్కడ ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించారు. మహిళలు గర్భం దాల్చిన నాటి నుంచి ఆరేళ్ల వరకు బాలామృతం ఇస్తామని, నర్సరీ నుంచి 12వ తరగతి వరకు అల్పాహారం, నాణ్యమైన భోజనం అందిస్తున్నామని సీఎం తెలిపారు. ఏటా రూ. 25 వేల కోట్లు విద్య కోసం ఖర్చు చేస్తున్నామని, టీచర్లు, సిబ్బందికి అల్పాహారం, భోజనం ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. 2 కోట్లకు పైగా మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం కల్పించామన్న రేవంత్ రెడ్డి ఉచిత బస్సు ప్రయాణం ద్వారా మహిళలకు రూ. 10 వేలు ఆదా అవుతుందని తెలిపారు. ఆర్టీసీకి ప్రభుత్వం రూ. 11 వేల కోట్లు చెల్లించిందని, 3.28 కోట్ల తెలంగాణ బిడ్డలకు సన్న బియ్యం అందిస్తున్నామని గుర్తు చేశారు. త్వరలో హైదరాబాద్‌లో లక్ష ఇందిరమ్మ ఇళ్లు కట్టి పేదలకు అందిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటివరకు గ్రామీణ ప్రాంతాల్లో 4.5 లక్షల ఇళ్లు కట్టామని పేర్కొన్నారు. పట్టణాల్లో - మిగతా 2 లో

## సింగరేణికి మరో

# 2 బొగ్గు బ్లాక్‌ల కేటాయింపు



- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రకటన
- తాడిచెర్ల-2 బ్లాక్ కూడా కేటాయింపు
- నైనీలో 35 ఏళ్లకు సరిపడా నిల్వలు
- రూ. 75 వేల కోట్ల ఆదాయం అంచనా

**వార్త సంధ్య, హైదరాబాద్, జులై 07 :** సింగరేణికి మరో రెండు కీలక బొగ్గు బ్లాక్‌లు దక్కనున్నాయి. ఒడిశాలోని నైనీ కోల్ బ్లాక్‌తో పాటు తాడిచెర్ల-2 కోల్ బ్లాక్‌ను కూడా సింగరేణికి కేటాయిస్తున్నట్లు కేంద్ర బొగ్గు శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి ప్రకటించారు. ఈ నిర్ణయం సంస్థ భవిష్యత్తుకు పెద్ద ఊరటనిస్తుందని చెప్పారు. ఢిల్లీలో మంగళవారం - మిగతా 2 లో

## పార్టీ పేరు వివాదం..

## ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన కవిత



- తన కొత్త పార్టీ పేరు వివాదంపై ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన కవిత
- 'టీఆర్ఎస్' పేరుపై అభ్యంతరం వ్యక్తం చేసిన ఎన్నికల సంఘం
- ముందుగా ఈసీకి వివరణ ఇవ్వాలని కవితకు సూచించిన ఉన్నత న్యాయస్థానం

**వార్త సంధ్య, హైదరాబాద్, జులై 07 :** కల్వకుంట్ల కవిత తన కొత్త రాజకీయ పార్టీ పేరు నమోదుకు సంబంధించి నెలకొన్న వివాదంపై ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తాను ప్రతిపాదించిన 'తెలంగాణ రక్షణ సేన' (టీఆర్ఎస్) పేరుకు అనుమతినిచ్చేలా - మిగతా 2 లో

## కడియం శ్రీహరిపై రేవంత్ రెడ్డికి ఫిర్యాదు చేసిన కొండా సురేఖ

- కాంగ్రెస్ పార్టీలో కొండా సురేఖ వర్సెస్ కడియం శ్రీహరి
- తన శాఖ అధికారులతో తనకు సమాచారం ఇవ్వకుండా కడియం సమీక్ష నిర్వహించారన్న సురేఖ
- మంత్రిగా తన పరిధిని బేఖాతరు చేశారని మండిపాటు
- కడియంపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని డిమాండ్



**వార్త సంధ్య, హైదరాబాద్, జులై 07 :** మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కడియం శ్రీహరి మధ్య ఆధిపత్య పోరు కాంగ్రెస్ పార్టీలో దుమారం రేపుతోంది. కడియం శ్రీహరిపై ఏకంగా సీఎం రేవంత్ రెడ్డికి కొండా సురేఖ ఫిర్యాదు చేయడం చర్చనీయాంశంగా మారింది. దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి అయిన తనకే కనీస సమాచారం ఇవ్వకుండా... ఆ శాఖ ఉన్నతాధికారులతో కడియం ఏకంగా అధికారిక సమీక్ష నిర్వహించారంటూ మంత్రి కొండా సురేఖ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రోటోకాల్ ఉల్లంఘనపై ఆమె నేరుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మూడు పేజీల లేఖ రాస్తూ - మిగతా 2 లో


# వయనాడ్‌లో మరోసారి విరిగిపడిన కొండచరియలు



- శిథిలాల కింద పలువురు!
- వయనాడ్‌లో భారీ వర్షాలు
- సొరంగం నిర్మాణ పనుల వద్ద కూలిన కొండచరియలు
- ఒకరు మృతి, ఏడుగురికి గాయాలు

**వార్త సంధ్య,కేరళ, జులై 07 :** కేరళలోని వయనాడ్‌లో మరోసారి కొండచరియలు బీభత్సం సృష్టిస్తున్నాయి. సోమవారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు అనక్కంపొయిల్-కల్లాడి టన్నెల్ ప్రాజెక్టు వద్ద కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ప్రమాదంలో ఒకరు ప్రాణాలు కోల్పోగా, ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి వీడీ సతీశన్ ప్రకటించారు. ఈ దుర్ఘటనలో మరో ఏడుగురు గల్లంతయ్యారని, వారి కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని ఆయన వెల్లడించారు. అధికారుల వివరాల ప్రకారం, కల్లాడిలోని మీనాక్షి వంతెన సమీపంలో టన్నెల్ నిర్మాణానికి సంబంధించి తవ్వకాలు జరుగుతున్న సమయంలో భారీగా మట్టి జారిపడింది. అక్కడే కార్మికుల తాత్కాలిక నివాసాలు ఉండటంతో - మిగతా 2 లో

## భోగాపురం విమానాశ్రయం సిద్ధం!



- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు
- భోగాపురం విమానాశ్రయాన్ని సందర్శించిన రామ్మోహన్ నాయుడు
- అన్ని పనులు పూర్తయ్యాయని తెలిపిన కేంద్ర మంత్రి
- మోదీ సమయం ఖరారు చేస్తే ప్రారంభోత్సవం ఉంటుందని వెల్లడి

**వార్త సంధ్య, అమరావతి, జులై 07 :** ఉత్తరాంధ్రలో కొత్త అభివృద్ధి చరిత్రకు నాంది పలుకుతూ భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం - మిగతా 2 లో


## ఇండోనేషియాకు భారత్ బ్రహ్మోస్ క్షిపణులు

- భారత్‌తో 200 మిలియన్ డాలర్ల డీల్
- ఇండోనేషియాకు బ్రహ్మోస్ క్షిపణులు విక్రయించేందుకు భారత్ ఒప్పందం
- సుమారు రూ. 1900 కోట్లతో డీల్
- ఫిలిప్పీన్స్, వియత్నాం తర్వాత బ్రహ్మోస్ కొన్న మూడో దేశం ఇండోనేషియా
- ఆస్త్రా క్షిపణులు, సాంకేతిక బదిలీపైనా కీలక ఒప్పందాలు
- భారత్, రష్యా సంయుక్తంగా బ్రహ్మోస్ క్షిపణి అభివృద్ధి




**వార్త సంధ్య,ఢిల్లీ, జులై 07 :** రక్షణ రంగ ఎగుమతుల్లో భారత్ మరో కీలక మైలురాయిని అధిగమించింది. ఇండోనేషియాకు సుమారు 200 మిలియన్ డాలర్ల (రూ. 1,900 కోట్లు) విలువైన రెండు బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణి బ్యాటరీలను సరఫరా చేసేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. మంగళవారం ఇరు దేశాల మధ్య జరిగిన పలు కీలక రక్షణ ఒప్పందాల్లో భాగంగా ఈ డీల్ ఖరారైంది. ఈ - మిగతా 2 లో

## ఏపీకి పెట్టుబడుల వేట



- కొరియాలో లోకేశ్ వరుస సమావేశాలు
- దక్షిణ కొరియా పర్యటనలో మంత్రి నారా లోకేశ్ బిజీ బిజీ
- ఎల్జీ, శాంసంగ్, హ్యుందాయ్ మోబిస్ వంటి దిగ్గజ సంస్థలతో భేటీ
- కాకినాడ, విశాఖలో యూనిట్లు, ఈవీ సెమీకండక్టర్ హబ్ ఏర్పాటుకు విజ్ఞప్తి

**వార్త సంధ్య, అమరావతి, జులై 07 :** రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ - మిగతా 2 లో

## ఆంధ్రప్రదేశ్ సాంప్రదాయ హస్తకళా వారసత్వానికి పుట్టినిల్లు




- ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్
- ఏపీ హస్తకళలను ప్రపంచ నలుమూలలకు తీసుకెళ్దాం
- మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా హస్తకళా రంగం కూడా అభివృద్ధి చెందాలి
- విజయవాడ అంబేద్కర్ కళా వేదికలో ఏపీ హస్తకళా మహోత్సవంలో పాల్గొన్న పవన్

**వార్త సంధ్య, అమరావతి, జులై 07 :** జాతి గొప్పతనం నిర్మాణాల్లో కాదు, కళాకారుల పనితనంలో ఉంటుందని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. బొబ్బిలి వీణలు, ఏటికొప్పాక బొమ్మలు మన సంస్కృతి చాటుతున్నాయన్నారు. హస్తకళా రూపాలు ప్రపంచానికి చేరాలంటే ఆన్‌లైన్ మార్కెటింగ్ అవసరం అన్నారు. వ్యర్థమని - మిగతా 2 లో

# ఏపీకి పెట్టుబడుల వెల్లువ

## మరో 11 ప్రాజెక్టులకు ఎస్ఐపీబీ ఆమోదం

- రూ.9076 కోట్ల పెట్టుబడులు, 10 వేల ఉద్యోగాలు
- సీఎం అధ్యక్షతన రాష్ట్ర స్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం
- పరిశ్రమలు, పెట్టుబడులు మౌలిక సదుపాయాల కల్పన శాఖల ప్రాజెక్టులపై చర్చ
- రూ.9,076 కోట్ల పెట్టుబడులకు సంబంధించి 11 ప్రాజెక్టులపై చర్చ
- రైతు కుటుంబాలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలన్న సీఎం
- పర్యాటక రంగం అభివృద్ధికి 100 ఎక్స్‌పీరియన్స్ సెంటర్లు
- ఇథనాల్, సోలార్ సెల్స్ తయారీ పరిశ్రమలకు ప్రోత్సాహం



**వార్త సంధ్య, అమరావతి, జులై 07 :** ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక ప్రగతికి ఊతమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన మంగళవారం సచివాలయంలో జరిగిన 19వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎస్ఐపీబీ) సమావేశంలో రూ. 9,076.11 కోట్ల విలువైన 11 ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. ఈ పెట్టుబడుల ద్వారా రాష్ట్రంలో సుమారు 10,531 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగావకాశాలు కలగనున్నాయి. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, రైతు కుటుంబాలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా పారిశ్రామికీకరణ జరగాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. భవిష్యత్తులో ఇథనాల్‌కు డిమాండ్ పెరగనున్న నేపథ్యంలో, ఆ రంగంలో పెట్టుబడులను ప్రోత్సహించాలన్నారు. దీనివల్ల మొక్కజొన్న రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందని పేర్కొన్నారు. ఇథనాల్, మీథేన్, ఏవియేషన్ ఫ్యూయల్‌కు సంబంధించి ఒక ప్రత్యేక పాలసీని రూపొందించాలని ఆదేశించారు. పర్యాటక రంగంలో ఉన్న అపార అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 100 పర్యాటక ప్రాంతాల్లో 'ఎక్స్‌పీరియన్స్ సెంటర్లు' ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. పోలవరం, గండికోట, లంబసింగి - మిగతా 2 లో

వార్త సంధ్య
vaartha sandhya
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు
RNI TGTEL/25/A5065



# సంపాదకీయం

## భావ ప్రకటనా స్వేచ్ఛ.. బాధ్యత మరవకూడదు!

భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి భావ ప్రకటనా స్వేచ్ఛను కల్పించింది. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రాణాధారం. ప్రజలు ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు, పాలకుల నిర్ణయాలను విమర్శించే అవకాశం, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడానికి మీడియాకు ఉన్న స్వేచ్ఛ -- ఇవన్నీ ఈ హక్కులో భాగమే. అయితే, ఏ హక్కైనా అపరిమితమైనది కాదు. రాజ్యాంగం కల్పించిన ప్రతి హక్కుకు బాధ్యత కూడా అంతే ముఖ్యమైనది.నేటి డిజిటల్ యుగంలో యూట్యూబ్, ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికల ద్వారా లక్షలాది మందిని క్షణాల్లో ప్రభావితం చేసే పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో కంటెంట్ సృష్టించే వారు, జర్నలిస్టులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు మరింత బాధ్యతతో వ్యవహరించాల్సిన అవసరం ఉంది. ప్రజలకు సమాచారం అందించడం, ప్రభుత్వాలను ప్రశ్నించడం, ప్రజా సమస్యలను ప్రస్తావించడం ప్రజాస్వామ్యంలో సహజమైన అంశాలే. కానీ ఆ పేరుతో అసత్య ప్రచారం, నిర్ధారణలేని ఆరోపణలు, వ్యక్తిగత దూషణలు, విద్వేషాన్ని రెచ్చగొట్టే వ్యాఖ్యలు లేదా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు ప్రేరేపించే సందేశాలు సమాజానికి మేలు చేయవు.జర్నలిజం అనేది కేవలం మైక్ పట్టుకోవడం లేదా యూట్యూబ్ ఛానల్ నిర్వహించడం మాత్రమే కాదు. అది ప్రజల పట్ల ఉన్న నైతిక బాధ్యత. ఒక వార్త లేదా వ్యాఖ్య లక్షలాది మందిపై ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. అందుకే వాస్తవ నిర్ధారణ, నిష్పాక్షికత, ప్రజాహితం వంటి విలువలు జర్నలిజంలో అత్యంత కీలకం. వ్యక్తిగత అభిప్రాయాన్ని వార్తగా చూపడం, సంచలనం కోసం వాస్తవాలను వక్రీకరించడం లేదా సమాజంలో ఉద్రిక్తతలు సృష్టించేలా వ్యవహరించడం మీడియా విశ్వసనీయతను దెబ్బతీస్తుంది.అదే సమయంలో, ప్రభుత్వం లేదా దర్యాప్తు సంస్థలు కూడా చట్టాలను అమలు చేసే విషయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలి. తీవ్రమైన నేరాల కోసం రూపొందించిన చట్టాలు నిజంగా అవసరమైన సందర్భాల్లోనే ఉపయోగించబడాలి. ప్రతి కేసులో ఆరోపణలు, సాక్ష్యాలు, చట్టపరమైన ప్రమాణాలు, కోర్టు పర్యవేక్షణ వంటి అంశాలు కీలకం. కఠిన చట్టాల వినియోగం ఎల్లప్పుడూ న్యాయపరమైన పరీక్షను తట్టుకునేలా ఉండాలి. లేకపోతే చట్టాలపై ప్రజల్లో అనుమానాలు పెరిగే అవకాశం ఉంటుంది.ప్రజాస్వామ్యంలో విమర్శలు అవసరం. పాలకులను ప్రశ్నించే స్వరం ఉండాలి. అదే సమయంలో దేశ సమగ్రత, ప్రజా శాంతి, సామాజిక సామరస్యాన్ని దెబ్బతీసే చర్యలను కూడా సమాజం సమర్థించదు. భావ ప్రకటనా స్వేచ్ఛ అంటే బాధ్యత లేకుండా ఏదైనా మాట్లాడే హక్కు కాదని గుర్తుంచుకోవాలి. స్వేచ్ఛ అనేది బాధ్యతతో కూడిన హక్కు.ఇటీవలి కాలంలో సోషల్ మీడియా వేదికలపై వ్యూస్, సబ్‌స్క్రైబర్లు, వైరల్ కంటెంట్ కోసం కొందరు అతిశయోక్తులు, అవాస్తవాలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలను ఆశ్రయిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇది ప్రజాస్వామ్య చర్చా సంస్కృతికి మేలు చేయదు. ప్రజలకు నిజమైన సమాచారం అందించాల్సిన వేదికలు అపోహలకు కేంద్రాలుగా మారితే, చివరికి నష్టపోయేది సమాజమే.భారత రాజ్యాంగం భావ ప్రకటనా స్వేచ్ఛను కల్పించినట్టే, ప్రజా శాంతి, దేశ భద్రత, నైతిక విలువలు, ఇతరుల హక్కుల పరిరక్షణ కోసం సహేతుకమైన పరిమితులను కూడా పేర్కొంది. అందువల్ల ప్రతి పౌరుడు తన హక్కులతో పాటు తన బాధ్యతలను కూడా గుర్తించాలి. స్వేచ్ఛను దుర్వినియోగం చేయకుండా, చట్టాలను కూడా నిష్పాక్షికంగా అమలు చేసే వ్యవస్థే బలమైన ప్రజాస్వామ్యానికి పునాది.చివరగా ఒక విషయం స్పష్టంగా చెప్పాలి. దేశంలో చట్టం అందరికీ సమానంగా వర్తించాలి. జర్నలిస్టు అయినా, యూట్యూబర్ అయినా, రాజకీయ నాయకుడైనా, సామాన్య పౌరుడైనా చట్టానికి అతీతులు కారు. అదే సమయంలో చట్ట అమలు కూడా రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా, న్యాయబద్ధంగా, పారదర్శకంగా ఉండాలి. స్వేచ్ఛకు బాధ్యత, అధికారానికి జవాబుదారీతనం, చట్టానికి న్యాయబద్ధత- ఈ మూడు విలువలు సమానంగా నిలబడినప్పుడే ప్రజాస్వామ్యం మరింత బలోపేతం అవుతుంది.



పీర్ల కళావతి
ఎమ్మెస్సీ, బీఎడ్, ఎల్.ఎల్.బి (2023-26)
సెల్ 8341476273

# ఏపీకి పెట్టుబడుల వేట

**మొదటిపేజీ తరువాయి -** దక్షిణ కొరియాలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన పలు దిగ్గజ కంపెనీల ప్రతినిధులతో వరుస సమావేశాలు నిర్వహిస్తూ, ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టాలని కోరుతున్నారు.సియోల్‌లో ఎల్జీ కెమ్ గ్లోబల్ స్ట్రాటజీ సెంటర్ ప్రెసిడెంట్ యున్-జు కోహ్?తో లోకేశ్ భేటీ అయ్యారు. కాకినాడ పోర్టు సమీపంలో పాలీస్టైరిన్ తయారీ కేంద్రాన్ని, మూలపేటలో ప్రపంచస్థాయి నాఫ్తా క్రాకర్ కేంద్రాన్ని ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని కోరారు. అలాగే, ఎల్జీ ఎలక్ట్రానిక్స్ గ్లోబల్ సీఈవో ల్యూ జె చెయోల్‌తో సమావేశమై... విశాఖపట్నంలో ఒక ఇంజనీరింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.అనంతరం హ్యుందాయ్ మోబిస్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ యంగ్ బిన్ కిమ్‌తో సమావేశమైన లోకేశ్, ఏపీలో ఈవీ సెమీకండక్టర్స్ హబ్ ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా, శాంసంగ్ ఎలక్ట్రానిక్స్ ప్రతినిధులతో భేటీ సందర్భంగా... ఏపీని డేటా సెంటర్లు, సర్వర్ తయారీకి భారతదేశపు స్థావరంగా మార్చాలని ప్రతిపాదించారు.ఈ సందర్భంగా క్వాంటమ్ టెక్నాలజీ రంగంలో ఏపీని దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టడమే తమ లక్ష్యమని లోకేశ్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో 150 క్యూబిట్‌ల క్వాంటమ్ కంప్యూటర్ ఏర్పాటు నుంచి, దాని తయారీ వరకు సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని వివరించారు. ఈ బిజీ షెడ్యూల్ మధ్య ఆయన ఎల్జీ సైన్స్ పార్క్ లో రోబోతో ఫొటో దిగారు.

# భోగాపురం విమానాశ్రయం సిద్ధం!

**మొదటిపేజీ తరువాయి -** నిర్మాణం పూర్తి స్థాయికి చేరుకుంది. కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు విమానాశ్రయాన్ని సందర్శించి పనుల పురోగతిని సమీక్షించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన స్పష్టమైన ఆదేశాలతో జీఎంఆర్ సంస్థ షెడ్యూల్ ప్రకారం పనులు పూర్తి చేసిందని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. ఇప్పటికే ఎయిరోడ్రోమ్ లైసెన్స్ వచ్చేసిందని వెల్లడించారు. ప్రధాని మోదీ సమయం ఖరారు చేస్తే వారి చేతుల మీదుగా ప్రారంభోత్సవ వేడుక ఉంటుందని కేంద్ర మంత్రి తెలిపారు. 78 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మితమైన టెర్మినల్ భవనం సంవత్సరానికి ఏకంగా నాలుగు కోట్ల మంది ప్రయాణికులకు సేవలు అందించే సామర్థ్యం కలిగి ఉంటుందని చెప్పారు. ఉత్తరాంధ్ర సంస్కృతి, కళలు ఉట్టిపడేలా డిజైన్ చేయడంతో ఇది దేశంలోనే అత్యుత్తమ విమానాశ్రయాల్లో ఒకటిగా నిలుస్తుందని వ్యాఖ్యానించారు. ప్రారంభం అయిన వారం లోపు విశాఖ విమానాశ్రయ కార్యకలాపాలను భోగాపురానికి మార్చి పూర్తి స్థాయిలో సేవలు ప్రారంభిస్తామని తెలిపారు.

# హైదరాబాద్‌లో లక్ష ఇందిరమ్మ ఇళ్లు కట్టి పేదలకు అందిస్తాం

**మొదటిపేజీ తరువాయి -** లక్ష ఇందిరమ్మ ఇళ్లు కట్టి పేదలకు ఇవ్వాలని లక్ష్యం పెట్టుకున్నామని వెల్లడించారు.2034లోగా కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. పెట్రోల్ బంకులకు స్థలాలు ఇచ్చి మహిళలు నడిపేలా చర్యలు చేపట్టామని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ఉప్పల్ అభివృద్ధి బాధ్యత తీసుకుంటామని స్పష్టం చేశారు.అంతకు ముందు నాచారంలో బాలామృతం ప్లాంటు ప్రారంభించిన సీఎం ప్లాంటు ఆవరణలో మొక్క నాటారు. రూ.40 కోట్లతో బాలామృతం ప్లాంటు నిర్మించారు. బాలామృతం ప్లాంటు లోపల ప్రత్యేక ప్రదర్శన సీఎం తిలకించారు. ప్లాంటు ప్రత్యేకతలను నిర్వాహకులు సీఎంకు వివరించారు. బాలామృతం తయారీ విధివిధానాలను సీఎం అడిగి తెలుసుకున్నారు. ప్లాంటు ద్వారా గంటకు 18 టన్నుల, నెలకు 10 వేల టన్నుల బాలామృతం తయారవుతుంది. మూడేళ్లలోపు పిల్లలకు పౌష్టికాహారం అందించేలా బాలామృతం తయారు చేస్తున్నారు.

# సింగరేణికి మరో 2 బొగ్గు బ్లాక్‌ల కేటాయింపు

**మొదటిపేజీ తరువాయి -** మాట్లాడిన కిషన్ రెడ్డి సింగరేణికి కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తోందన్నారు. బొగ్గు ఉత్పత్తిని మరింత పెంచాల్సిన అవసరం ఉందని సూచించారు. ఒడిశాలోని నైనీ కోల్ బ్లాక్ సింగరేణికి దక్కేలా కేంద్రం చొరవ తీసుకుందని వెల్లడించారు. ఇతర రాష్ట్రాల్లో జరిగే బొగ్గు బ్లాక్‌ల వేలంలోనూ సింగరేణి పాల్గొనేలా తన వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు.నైనీ కోల్ బ్లాక్‌లో మరో 35 ఏళ్లకు సరిపడా బొగ్గు నిల్వలు ఉన్నాయని కిషన్‌రెడ్డి చెప్పారు. దీని వల్ల సింగరేణికి సుమారు రూ.75 వేల కోట్ల ఆదాయం వచ్చే అవకాశం ఉందని అంచనా వేశారు. తెలంగాణలో లక్షలాది కుటుంబాల జీవనాధారం సింగరేణి అని పేర్కొన్నారు. తాడిచెర్ల-2 కోల్ బ్లాక్‌ను కూడా సింగరేణికే కేటాయించాలని కేంద్రం నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. ఈ బ్లాక్‌తో సంస్థ కార్యకలాపాలు మరింత బలోపేతం అవుతాయన్నారు. భవిష్యత్తులో ఉత్పత్తి పెరగడానికి ఇది దోహదపడుతుందని తెలిపారు.

# ఏపీకి పెట్టుబడుల వెల్లువ మరో 11 ప్రాజెక్టులకు ఎస్ఐపీబీ ఆమోదం

**మొదటిపేజీ తరువాయి -** వంటి ప్రాంతాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలన్నారు. పునరుత్పాదక ఇంధన రంగంలో సోలార్ సెల్స్ తయారీలో ఏపీని అగ్రగామిగా నిలపాలని, పెండింగ్‌లో ఉన్న 38 ఎంఎస్ఎంఈ పార్కులను త్వరితగతిన ప్రారంభించాలని సూచించారు. ఈ సమావేశంలో మంత్రులు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, పి.నారాయణ, గొట్టిపాటి రవికుమార్, కందుల దుర్గేష్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



ఎస్ఐపీబీ ఆమోదం తెలిపిన 11 ప్రాజెక్టుల వివరాలు:

1. డీఎస్ఆర్ హాస్పిటాలిటీ: నెల్లూరులో రూ.139.92 కోట్లతో 4-స్టార్ హోటల్ (180 మందికి ఉపాధి).
2. మాధవి లీజర్ అండ్ స్టేస్: కడపలో రూ.52.10 కోట్లతో 3-స్టార్ హోటల్ (400 మందికి ఉపాధి).
3. శ్రీనివాసం అమ్యూజ్‌మెంట్: కడపలో రూ.68.69 కోట్లతో ఇంటిగ్రేటెడ్ అమ్యూజ్‌మెంట్ పార్క్ (690 మందికి ఉపాధి).
4. వజ్ర హాస్పిటాలిటీ: విజయవాడలో రూ.62.40 కోట్లతో హోటల్, బ్యాంక్వెట్ సెంటర్ (450 మందికి ఉపాధి).
5. నెక్సస్ ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్ పార్క్: తిరుపతి జిల్లాలో రూ.255 కోట్లతో లాజిస్టిక్స్ పార్క్ (400 మందికి ఉపాధి).
6. అక్షత్ గ్రీన్‌టెక్: అనకాపల్లి జిల్లాలో రూ.1,600 కోట్లతో సోలార్ సెల్, మాడ్యూల్ యూనిట్ (750 మందికి ఉపాధి).
7. బెర్రీ అలాయ్స్: బొబ్బిలిలో రూ.1,200 కోట్లతో మాంగనీస్ సిన్టర్ ప్లాంట్ (831 మందికి ఉపాధి).
8. జియో మైసూర్ ఇండియా: కర్నూలు జిల్లా తుగ్గలిలో రూ.689 కోట్లతో స్వర్ణగిరి గోల్డ్ మైనింగ్ ప్రాజెక్ట్ (1,750 మందికి ఉపాధి).
9. ఈకో బాక్స్ ఇండస్ట్రియల్స్ (గూగుల్ వేర్‌హౌస్ పార్ట్‌నర్స్): విశాఖలో రూ.1,008 కోట్లతో లాజిస్టిక్స్ పార్క్ (5,000 మందికి ఉపాధి).
10. అదానీ ఫౌండేషన్: విశాఖ జిల్లా కపులుప్పాడలో రూ.2,200 కోట్ల ప్రాజెక్టు.
11. మోండెలీజ్ ఇండియా ఫుడ్స్: శ్రీ సిటీలో రూ.1,801 కోట్లతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ (80 మందికి ఉపాధి).

గత రెండేళ్లలో ఇప్పటివరకు 19 ఎస్ఐపీబీ సమావేశాలు నిర్వహించగా, మొత్తం 339 ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. వీటి ద్వారా రాష్ట్రానికి రూ.11.86 లక్షల కోట్ల పెట్టుబడులు, 10.41 లక్షల ఉద్యోగాలు రానున్నాయని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. తాజా నిర్ణయాలతో పారిశ్రామికంగా రాష్ట్రం మరింత బలోపేతం కానుంది.

# ఆంధ్రప్రదేశ్ సాంప్రదాయ హస్తకళా వారసత్వానికి పుట్టినిల్లు

**మొదటిపేజీ తరువాయి -** భావించే గుర్రపుడెక్క ఆకుతో కూడా కళాకృతులు రూపొందించారని గుర్తుచేశారు. హస్తకళాకారుల హెల్త్ ఆడిట్ చేయాలని అధికారులను ఆదేశించారు.విజయవాడ అంబేద్కర్ కళా వేదికలో ఏపీ హస్తకళా మహోత్సవానికి పవన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హస్తకళాకారుల స్టాళ్లను పరిశీలించారు. కొండపల్లి, ఏటికొప్పాక వంటి బొమ్మలను ఆసక్తిగా చూశారు. హస్తకళాకారుల గ్రామాలను పర్యాటకంతో అనుసంధానించాలని అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో చేనేత, హస్తకళల సలహాదారు సుచిత్రా ఎల్లా సూచించిన ప్రతిపాదనను పవన్ అభినందించారు."సాంప్రదాయ హస్తకళా వారసత్వానికి ఆంధ్రప్రదేశ్ పుట్టినిల్లు. కళాకారుల అద్భుత ప్రతిభ వారి కష్టాన్ని గుర్తించడానికి వచ్చా. అద్భుత కళల వెనుక లక్షలమంది కళాకారుల కృషి ఉంది. వస్తువుల తయారీ మాత్రమే కాదు, వారసత్వాన్ని సజీవంగా ఉంచుతున్నారు. తరతరాల సంప్రదాయాన్ని కళాకారులు కాపాడుతున్నారు. రాష్ట్రంలో రెండు లక్షలమందికి పైగా కళాకారులు ఉన్నారు. మూడో వంతుకు పైగా అవార్డులు సాధించామంటే కళాకారుల ప్రతిభకు ఇదే నిదర్శనం. గ్లోబల్ మార్కెట్‌కు అనుసంధానం చేస్తూ హస్తకళా రంగానికి కొత్త దిశ. గుర్రపుడెక్క ఆకుతో కూడా వస్తువుల తయారీ చూస్తున్నాం. వదిలేసిన వస్త్రాలు కూడా వ్యర్థం కాకుండా వస్తువుల తయారీ చూస్తున్నాం. డబ్బు సంపాదనే కాదు, పర్యావరణ పరిరక్షణ కూడా ప్రాముఖ్యంగా తీసుకుంటున్నారు.ఒక ఇంటి నుంచి ప్రారంభమైన వస్తువుకు ప్రపంచ మార్కెట్‌లో గిరాకీ లభిస్తోంది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా హస్తకళా రంగం కూడా అభివృద్ధి చెందాలి. మారుమూల గ్రామంలోని కళాకారుడి కృషి, ప్రపంచానికి చేరాలనేదే లక్ష్యం. తల్లిదండ్రుల కళను పిల్లలు కూడా అనుసరించేలా చేయాలి. మనందరం కలిసి కళాకారులను ప్రోత్సహిద్దాం. వోకల్ ఫర్ లోకల్ మాత్రమే కాదు, లోకల్ టు గ్లోబల్ లక్ష్యంగా పనిచేద్దాం. ఏపీ




హస్తకళలను ప్రపంచ నలుమూలలకు తీసుకెళ్దాం. మార్కెటింగ్ ఇంకా పెంచగలిగితే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చు.అనారోగ్య సమస్యల నుంచి కళాకారులను కాపాడాలి. తొలుత కళాకారులందరికీ ఆరోగ్య పరీక్షలు చేయించాలి. హస్తకళాకారుల పిల్లలు చదువు కునేలా ఏర్పాట్లు చేయాలి. వంశపార పర్యంగా వచ్చిన కళను ముందుకు తీసుకెళ్లడం కూడా ముఖ్యమే. హస్తకళా రంగాలు భారతదేశ మూలా లు. దేశ సంస్కృతి, సంప్రదాయాలు కొనసాగాలంటే హస్తకళను, చేనేతను కాపాడుకోవాలి. వస్తువుల తయారీలో కొత్త ఆవిష్కరణలు రావాలి" అని పవన్ కల్యాణ్ తెలిపారు."కళాకారుల ప్రతిభ ప్రపంచానికి తెలియాలి. పిల్లలు, వారి తల్లిదండ్రుల కళను వారసత్వంగా కొనసాగించాలి. సంప్రదాయం గుర్తుచేసు కోవడానికి కాదు, మరింత ముందుకు సాగాలి. లోకల్ టు గ్లోబల్ రీతిన మన హస్తకళలు ప్రపంచానికి చేరాలి. మన వస్తువులకు మార్కెటింగ్ పెరగాలి. కళారూపాలకు మూలాధారమైన కర్ర నిల్వ అవసరం. కళాకారులపై కేసులు లేకుండా చేశాం. హస్త కళాకారుల కోసం కంటిచూపు పరీక్షలు నిర్వహిస్తాం. భారతదేశ ఉనికికి హస్త కళారూపాలు మూలం. హస్త కళాకారుల కోసం ప్రభుత్వం దన్నుగా నిలబడు తుంది. ప్రతి కళాకారుడికి ఒక కథ, ఒక కష్టం ఉంటుంది. హస్తకళల గ్రామాలను పర్యాటకంగా అనుసం ధానం చేయాలి.హస్త కళాకారుల సమస్యలపై కేబినెట్‌లో ప్రస్తావిసామన్న ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్.

# వయనాడ్‌లో మరోసారి విరిగిపడిన కొండచరియలు

**మొదటిపేజీ తరువాయి -** ఆందోళన నెలకొంది. స్థానికులు వెంటనే స్పందించి ముగ్గురిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. అదే ప్రాంతంలో కొన్ని ఇళ్లు, హోమ్‌స్టేలు కూడా ఉండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. టన్నెల్ ప్రాజెక్టు సిబ్బందిని తరలించే కొన్ని వాహనాలు కూడా మట్టికుప్పల కింద దెబ్బతిన్నాయి. ఘటన సమాచారం అందుకున్న వెంటనే కల్పెట్ట అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు అక్కడికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించాయి. మీనంగాడిలో ఉన్న ఎన్‌డీఆర్ఎఫ్ బృందాన్ని తక్షణమే ఘటనాస్థలికి పంపించగా, కోజికోడ్ నుంచి మరో బృందాన్ని కూడా తరలించారు. సహాయక సిబ్బంది ఇప్పటివరకు ఒక మృతదేహాన్ని వెలికితీశారు. గాయపడిన ఏడుగురిని తక్షణమే ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్య సదుపాయాలు అందిస్తున్నారు. శిథిలాల కింద చిక్కుకున్నట్లు భావిస్తున్న మరో ఏడుగురి కోసం రెస్క్యూ సిబ్బంది, పోలీసులు గాలిస్తున్నారు.సమీప ప్రాంతాల్లో నివసిస్తున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఘటనా స్థలంలో కార్మికులు ఎవరూ లేరని, ఇంజనీర్లు, భద్రతా సిబ్బంది శిథిలాల కింద చిక్కుకుని ఉండొచ్చని అని ఒక సీనియర్ ప్రభుత్వ అధికారి విలేకరులతో చెప్పారు. ఒకవేళ పని జరుగుతూ ఉండి ఉంటే ఇంకా పెను ప్రమాదంగా మారేదని చెప్పారు. అయితే భారీగా పేరుకుపోయిన మట్టిని తొలగించేందుకు భారీ ఎర్త్‌మూవింగ్ యంత్రాలు అవసరమని స్థానికులు తెలిపారు. మట్టికుప్పలను తొలగించిన తర్వాతే పూర్తిస్థాయిలో గాలింపు చర్యలు చేపట్టే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. కొండచరియల కారణంగా మలప్పురం - వయనాడ్ మార్గంలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. మరోవైపు, మీనాక్షి వంతెన వద్ద నది ఉప్పొంగి ప్రవహిస్తోంది.

### ముఖ్యమంత్రి అత్యవసర సమీక్ష

ఘటనపై కేరళ ముఖ్యమంత్రి వీడీ సతీశన్ అత్యవసర సమీక్ష నిర్వహించారు. జిల్లా మంత్రులతో సమావేశమై సహాయక చర్యలను యుద్ధప్రాతిపదికన కొనసాగించాలని ఆదేశించారు. మంత్రులు ఏపీ అనిల్‌కుమార్, టీ సిద్ధిక్ వెంటనే వయనాడ్‌కు వెళ్లి సహాయక చర్యలను పర్యవేక్షించాలని సూచించారు. జిల్లా కలెక్టర్‌తో కలిసి పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నారు.

### 'సహజ విపత్తు కాదు- మానవ తప్పిదమే'

ఈ ఘటనపై స్పందించిన మంత్రి సిద్దిఖీ సహజంగా సంభవించినది కాదని, మానవ తప్పిదం వల్లే జరిగిందని అన్నారు. తవ్వకాల నుంచి వెలికితీసిన మట్టిని శాస్త్రీయ పద్ధతిలో నిల్వ చేయకపోవడంతో అది భారీ వర్షాలకు జారిపడి ఈ ప్రమాదం జరిగిందని తెలిపారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించామని ప్రస్తుతం వారందరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ఎలాంటి ప్రాణాపాయం లేదని చెప్పారు.

### భయానక దృశ్యాలు వైరల్

ఘటనకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. మీనాక్షి వంతెన సమీపంలో భారీ మట్టికుప్ప ఒక్కసారిగా కిందకు జారిపడుతుండగా, అక్కడున్న ప్రజలు ప్రాణభయంతో పరుగులు తీసిన దృశ్యాలు అందులో కనిపించాయి. "వేగంగా పరుగెత్తండి ప్రాణాలు కాపాడుకోండి" అంటూ ప్రత్యక్ష సాక్షి హెచ్చరిస్తున్న శబ్దం కూడా వీడియోలో వినిపించింది. క్షణాల్లో చెట్లు నేలకూలడం, నిర్మాణ ప్రాంతంలోని ఇనుప బారికేడ్లు మట్టిలో కొట్టుకుపోవడం స్థానికులను భయాందోళనకు గురిచేసింది.

### రెడ్ అలర్ట్ జారీ

గత 24 గంటల్లో వయనాడ్ ప్రాంతంలో 265 మిల్లీమీటర్ల భారీ వర్షపాతం నమోదైనట్లు కేఎస్‌డీఎంఏ తెలిపింది. దీంతో మంగళవారం రెడ్ అలర్ట్ జారీ చేసింది. కోజికోడ్‌కు రెడ్, మలప్పురం, కన్నూర్, కాసరగోడ్ జిల్లాల్లో ఆరెంజ్ అలర్ట్‌ను జారీచేసింది.

## ఇండోనేషియాకు భారత్ బ్రహ్మోస్ క్షిపణులు

**మొదటిపేజీ తరువాయి -**

ఒప్పందంతో బ్రహ్మోస్ క్షిపణులను కొనుగోలు చేసిన మూడో విదేశీ కస్టమర్‌గా ఇండోనేషియా నిలిచింది. ఇప్పటికే 2022లో ఫిలిప్పీన్స్ మూడు బ్యాటరీల కోసం ఒప్పందం చేసుకోగా, ఈ ఏడాదే వియత్నాం కూడా బ్రహ్మోస్ కొనుగోలుకు అంగీకరించింది. తాజా ఒప్పందంతో ఇండో-పసిఫిక్ ప్రాంతంలో భారత్ తన రక్షణ భాగస్వామ్యాన్ని మరింత పటిష్టం చేసుకుంటోంది.ఈ డీల్ కేవలం బ్రహ్మోస్ క్షిపణులకే పరిమితం కాలేదు. అస్త్రా ఎయిర్-టు-ఎయిర్ క్షిపణి వ్యవస్థలు, కీలకమైన రక్షణ సాంకేతిక పరిజ్ఞానం బదిలీ, సముద్ర భద్రత వంటి అంశాలపై కూడా ఇరు దేశాలు అంగీకారానికి వచ్చాయి. గత ఏడాది నవంబర్‌లో జరిగిన ఇరు దేశాల రక్షణ మంత్రుల సమావేశంలోనే ఈ ఒప్పందాలపై చర్చలు మొదలయ్యాయి.భారత్‌కు చెందిన డీఆర్‌డీవో, రష్యాకు చెందిన ఎన్పీవో మషినోస్ట్రోయెనియా సంయుక్తంగా బ్రహ్మోస్ క్షిపణిని అభివృద్ధి చేశాయి. ఇది భారత త్రివిధ దళాల్లోనూ సేవలందిస్తోంది. భారత్ మరో అరడజను దేశాలతో బ్రహ్మోస్ అమ్మకాలపై చర్చలు జరుపుతున్నట్లు సమాచారం.సాధారణంగా ఒక బ్రహ్మోస్ బ్యాటరీలో 4 లాంచర్లు ఉంటాయి. ఒక్కో లాంచర్ పై 3 రెడీ టు ఫైర్ బ్రహ్మోస్ క్షిపణులు ఉంటాయి. ఆ లెక్కన ఒక బ్యాటరీలో మొత్తం 12 క్షిపణులు ఉంటాయి. వీటిని కేవలం 30 సెకన్ల వ్యవధిలోనే వేర్వేరు లక్ష్యాలపై ప్రయోగించవచ్చు.

## కడియం శ్రీహరిపై రేవంత్ రెడ్డికి ఫిర్యాదు చేసిన కొండా సురేఖ

**మొదటిపేజీ తరువాయి -** అధికారికంగా ఫిర్యాదు చేశారు. కడియం శ్రీహరి ప్రభుత్వ పరిపాలనా విధానాలను, మంత్రిగా తన అధికార పరిధిని పూర్తిగా బేఖాతరు చేశారని ఆమె సీఎం దృష్టికి తీసుకెళ్లారు.దేవాదాయ శాఖకు సంబంధించిన పరిపాలన, కీలక నిర్ణయాలు, అధికారిక సమీక్షలన్నీ పూర్తిగా సంబంధిత శాఖా మంత్రి పరిధిలోకే వస్తాయని కొండా సురేఖ స్పష్టం చేశారు. కానీ, ఎమ్మెల్యే కడియం శ్రీహరి దేవాదాయ శాఖ డైరెక్టర్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులను పిలిపించుకుని... దేవాలయాల అభివృద్ధి, నిధుల కేటాయింపులు, మాస్టర్ ప్లాన్ల రూపకల్పన, భూముల పరిరక్షణ వంటి అంశాలపై సమీక్ష చేశారని లేఖలో మండిపడ్డారు. అంతేకాకుండా అధికారులకు డెడ్‌లైన్లు కూడా పెట్టడం పరిపాలనా పరంగా తీవ్ర అభ్యంతరకరమని, ఇది ప్రభుత్వ 'రూల్స్ ఆఫ్ బిజినెస్' స్ఫూర్తిని నిలువునా ఉల్లంఘించడమేనని తేల్చిచెప్పారు.రాజకీయాల్లో ఎంతో అనుభవం ఉన్న కడియం శ్రీహరికి... శాఖా పరమైన నిర్ణయాలు మంత్రి ఆధ్వర్యంలోనే జరగాలనే కనీస విషయం తెలియదా అని కొండా సురేఖ నిలదీశారు. తనను పూర్తిగా పక్కనపెట్టి ఇలాంటి సమీక్షలు చేయడం ప్రభుత్వ పరిపాలనా వ్యవస్థలో చెడు సంప్రదాయానికి దారితీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇవి అధికార యంత్రాంగంలో తీవ్ర అయోమయానికి కారణమవుతాయన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా, కడియం శ్రీహరి నుంచి వివరణ కోరాలని... అలాగే పార్టీ క్రమశిక్షణా కమిటీ ద్వారా విచారణ జరిపించి ఆయనపై తగిన చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డిని కొండా సురేఖ కోరారు.

# పార్టీ పేరు వివాదం.. ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన కవిత

**మొదటిపేజీ తరువాయి -** కేంద్ర ఎన్నికల సంఘాన్ని (ఈసీ) ఆదేశించాలని కోరుతూ ఆమె పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం, ముందుగా ఎన్నికల సంఘం లేవనెత్తిన అభ్యంతరాలకు సమాధానం ఇవ్వాలని కవితకు సూచించింది. ప్రస్తుత దశలో తాము జోక్యం చేసుకోవడం ఎన్నికల సంఘం విధుల్లో తలదూర్చడమే అవుతుందని కోర్టు స్పష్టం చేసింది.బీఆర్ఎస్ పార్టీ పాత పేరు 'తెలంగాణ రాష్ట్ర సమితి'ని పోలి 'టీఆర్ఎస్' అనే సంక్షిప్త నామం వస్తుండటంతో, దీనిపై జూన్ 23న కేంద్ర ఎన్నికల సంఘం అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ పేరు ప్రజల్లో గందరగోళానికి దారితీస్తుందని పేర్కొన్న ఈసీ, 15 రోజుల్లోగా మూడు ప్రత్యామ్నాయ పేర్లను సూచించాలని కవితను ఆదేశించింది. ఎన్నికల సంఘం జారీ చేసిన ఈ ఆదేశాలనే కవిత కోర్టులో సవాలు చేశారు.బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చిన కవిత, ఈ ఏడాది ఆరంభంలో సొంతంగా రాజకీయ పార్టీని ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఆమె ప్రతిపాదించిన 'తెలంగాణ రక్షణ సేన' పేరుకు ఏప్రిల్‌లో ఈసీ ప్రాథమిక ఆమోదం తెలిపింది. అయితే, ఈ పేరులోని 'టీఆర్ఎస్' అనే సంక్షిప్త రూపం పాత పార్టీని గుర్తుచేస్తోందంటూ 1,100కు పైగా అభ్యంతరాలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకున్న ఎన్నికల సంఘం కవితకు నోటీసులు జారీ చేసింది.



## చరిత్ర సృష్టించిన మోదీ.. ఇండోనేషియా పార్లమెంట్‌లో ప్రసంగించిన తొలి భారత ప్రధాని


**ఇండోనేషియా పార్లమెంట్‌లో ప్రసంగించిన తొలి భారత ప్రధానిగా నరేంద్ర మోదీ**

**రామాయణ, మహాభారత కాలం నుంచి ఇరుదేశాల మధ్య చారిత్రక బంధం ఉందని వ్యాఖ్య**

**ఈవీఎంల తయారీలో సాయం, ఐఐఎం బెంగళూరు క్యాంపస్ ఏర్పాటుకు భారత్ సిద్ధమని ప్రకటన**

**భారత పథకాలపై ఇండోనేషియా అధ్యక్షుడి ప్రశంసలకు 'మిత్రుల మధ్య కాపీరైట్లు ఉండవు' అని చమత్కారం**

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన ఇండోనేషియా పర్యటనలో చారిత్రక ఘట్టాన్ని ఆవిష్కరించారు. జకార్తాలో మంగళవారం ఇండోనేషియా పార్లమెంట్ ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించిన తొలి భారత ప్రధానిగా ఆయన సరికొత్త రికార్డు సృష్టించారు. ఇరు దేశాల మధ్య ఉన్న నాగరికత, చారిత్రక వారసత్వ సంబంధాలను గుర్తుచేస్తూ, ప్రాంతీయ స్థిరత్వం కోసం ఉమ్మడిగా కృషి చేయాల్సిన ఆవశ్యకతను ఆయన తన ప్రసంగంలో నొక్కిచెప్పారు.భారత్, ఇండోనేషియాలను సముద్రాలు వేరుచేయడం లేదని, చరిత్ర, సంస్కృతి, ప్రజాస్వామ్య విలువలనే వారధులు రెండు దేశాలను అనుసంధానం చేస్తున్నాయని మోదీ పేర్కొన్నారు. రామాయణ, మహాభారత కాలం నుంచి ఇరు దేశాల మధ్య దృఢమైన సాంస్కృతిక బంధం ఉందని ఆయన గుర్తుచేశారు. ఈ సందర్భంగా తమకు ఘన స్వాగతం పలికిన ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటోకు, పార్లమెంట్‌లో ప్రసంగించే అరుదైన అవకాశం కల్పించిన స్పీకర్‌కు ప్రధాని కృతజ్ఞతలు తెలిపారు.ఈ పర్యటనలో భాగంగా ఇండోనేషియా ఎన్నికల వ్యవస్థ ఆధునికీకరణకు భారత్ పూర్తి సహకారం అందిస్తుందని ప్రధాని హామీ ఇచ్చారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం) అభివృద్ధిలో తోడ్పాటున ఒదిస్తామని, అదేవిధంగా ఇండోనేషియాలో ఐఐఎం బెంగళూరు క్యాంపస్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన ప్రకటించారు.



భారత ప్రభుత్వ పథకాలను తమ దేశంలోనూ అమలు చేస్తామని గతంలో ఇండోనేషియా అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, "మిత్రుల మధ్య కాపీరైట్లు ఉండవు" అని మోదీ చమత్కరించడంతో సభలో నవ్వులు విరిశాయి. ఇరు దేశాల మధ్య నెలకొన్న సుహృద్భావ వాతావరణానికి ఈ వ్యాఖ్య అద్దం పట్టింది. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం, శ్రేయస్సు కోసం రెండు దేశాల మధ్య సహకారం అత్యంత కీలకమని ప్రధాని ఉద్ఘాటించారు. జూలై 6 నుంచి 11 వరకు ఇండోనేషియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల్లో ప్రధాని మోదీ పర్యటిస్తున్నారు.

వార్త సంధ్య
RNI TGTEL/25/A5065
జనరల్ న్యూస్
బుధవారం
08 - 07 - 2026


# గురుకులాల జీవో నెంబర్ 17 వారంలోపు రద్దు చేయాలని తెలంగాణ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ కాంట్రాక్టర్లు అసోసియేషన్ జేఏసీ చైర్మన్ మంద శ్యామ్ డిమాండ్ చేశారు




**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) జూలై 7 :** మంగళవారం నాడు సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుడ్లు కిరాణం టెండర్లను వెంటనే డిపిసి విధానంలో నిర్వహించాలని కార్పొరేట్ కంపెనీలకు కొమ్ముగాస్తు చిన్న కాంట్రాక్టర్లపై పొట్ట కొట్టవద్దని తెలంగాణ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ కాంట్రాక్టర్లు అసోసియేషన్ జేఏసీ చైర్మన్ మంద శ్యామ్ డిమాండ్ చేశారు గురుకులాల విద్య వ్యవస్థల గుడ్లు, కిరాణం సరఫరా టెండర్లు ప్రభుత్వం అమలు చేస్తున్న జీవో నెంబర్ 17 వల్ల వేలాది మంది ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాలకు చెందిన చిన్న కాంట్రాక్టర్లు స్థానిక పౌల్ట్రీ రైతులు కిరణ వ్యాపారులు నిరుద్యోగ యువత ఉపాధి కోల్పోయే పరిస్థితి ఉందని ఆయన చెప్పారు డిపిసి విధానాన్ని పునరుద్ధరిస్తే ప్రభుత్వానికి పారదర్శకంగా పూడి ధరల్లో నాణ్యమైన సరుకులు అందుతాయని స్థానిక కాంట్రాక్టర్లు పౌల్ట్రీ రైతులు కిరణ వ్యాపారులకు ఉపాధి అవకాశాలు కొనసాగుతాయని గురుకులాల విద్యార్థులు నాణ్యమైన ఆహారం అందుతుందని ఆయన తెలిపారు డిపిసి విధానంలోనే నిర్వహించాలని జేఏసీ బలంగా డిమాండ్ చేసిందని ఆయన చెప్పారు సామాజిక న్యాయం సామాజిక అంశాలు కల్పిస్తామని అధికారులకు వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా కాకుండా చిన్న కాంట్రాక్టర్లు స్థానిక వ్యాపారులు రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని వెంటనే నిర్ణయం తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు ఈ సమావేశంలో జెఎసి కన్వీనర్ హుస్సేన్ అజాద్, నర్ర నిర్మల కో కన్వీనర్ జన్ను స్వప్న, కో కన్వీనర్ బోయ స్వప్న డిస్ట్రిక్ట్ కన్వీనర్ , బొట్ల వెంకటేష్, జిల్లా అధ్యక్షులు తిమ్మ వినోద్,, సికింద్రాబాద్ నేత దొర రమేష్ తదితరులు పాల్గొని ప్రసంగించారు

# చంద్రుగొండలో జోరుగా ఎస్ఐఆర్ఇంటింటి సర్వే.. ఓటరు జాబితా సవరణపై అవగాహన



**చంద్రుగొండలో ప్రతినిధి జూలై 7:(వార్త సంధ్య) :** అశ్వారావుపేట నియోజకవర్గంలోని చంద్రుగొండ గ్రామపంచాయతీ అంబేద్కర్ నగర్ ఎస్సీ కాలనీలో సోమవారం ా×= ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమం కింద ఇంటింటి సర్వే నిర్వహించారు. మండల కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బడుగు శంకర్ ఆధ్వర్యంలో ఓటరు నమోదు, వివరాల సవరణ, మార్పులు, తొలగింపులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా దీూూ బుంగ శ్రీనివాసరావు, దీూూ హస్సేన్, మండల నాయకులు బడుగు రాములు, సోషల్ మీడియా కోఆర్డినేటర్ బడుగు వెంకటేష్ (చిన్ని) తదితరులు పాల్గొని ఎన్యూమరేషన్ ఫారాలను పరిశీలించి దీూూలకు సమర్పించారు. రాష్ట్రవ్యాప్తంగా ా×= ఇంటింటి సర్వే కార్యక్రమం ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం కొనసాగుతోంది.

# 10 న విద్యాసంస్థల బంద్ కు మద్దతుగా విద్యార్థుల ర్యాలీ



**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూలై 07 (వార్త సంధ్య) :** విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం జూలై 10న నిర్వహించనున్న విద్యా సంస్థల బంద్ను విజయవంతం చేయాలని కోరుతూ కొత్తగూడెంలో విద్యార్థులు మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించారు. రైల్వే స్టేషన్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు సాగిన ర్యాలీలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

# బెండాలపాడులో ఎస్ఐఆర్ సర్వే పరిశీలించిన కాంగ్రెస్ మండల కోఆర్డినేటర్ దిలీప్



**చంద్రుగొండ ప్రతినిధి, జూలై 7:(వార్త సంధ్య) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గంలోని చంద్రుగొండ మండలం బెండాలపాడు గ్రామంలో కొనసాగుతున్న ా×= (ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ) సర్వేను కాంగ్రెస్ పార్టీ చంద్రుగొండ మండల దీూూల కోఆర్డినేటర్ మేడరాజుల దిలీప్ పరిశీలించారు. ఎన్యూమరేషన్ ఫారాల్లో ఓటర్ల వివరాల నమోదు ప్రక్రియను దీూూలు, దీూూలతో కలిసి పరిశీలించిన ఆయన, సర్వేలో ఎలాంటి తప్పులు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సర్వే పురోగతిపై ఆరా తీసి, సందేహాలు ఉంటే తనను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామశాఖ నాయకుడు మల్లం కృష్ణయ్య, దీూూ పొట్ట రాము, దీూూ వర్స నీలమ్మతో పాటు గ్రామ పంచాయతీ ఓటర్లు పాల్గొన్నారు.

# అక్రమ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి : జిల్లా కలెక్టర్కు గిరిజన విద్యార్థి సంఘం ఫిర్యాదు



**చుంచుపల్లి ప్రతినిధి 07 (వార్త సంధ్య):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మం డలం రామవరం (ఎస్ సీబీ నగర్)లో భారత్ పబ్లిక్ స్కూల్, ఎస్ఆర్ ప్రైమ్ స్కూల్, ప్రైమ్ స్కూల్ పేర్లతో కొనసాగుతున్న అక్రమ విద్యా కార్యకలాపాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని గిరిజన విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మూడ్ బాలాజీ నాయక్ జిల్లా కలెక్టర్కు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సీబీఎస్ఈ అఫిలియేషన్ లేకుండానే సీబీఎస్ఈ పేరుతో అడ్మిషన్లు, ప్రచారం, ఫీజుల వసూళ్లు నిర్వహిస్తూ తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే విచారణ కమిటీ నివేదిక సమర్పించినప్పటికీ చర్యలు లేకపోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తూ, విచారణ పూర్తయ్యే వరకు కొత్త అడ్మిషన్లు నిలిపివేసి, అక్రమాలు నిర్ధారణ అయితే యాజమాన్యం, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# జూలై 10 విద్యాసంస్థల బంద్కు విద్యార్థి సంఘాల పిలుపు

**తెలంగాణ విద్యారంగ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి**

**విద్యార్థుల నిరసన ప్రదర్శన విజయవంతం**




**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూలై 07 (వార్త సంధ్య) :** తెలంగాణ రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాల రాష్ట్ర కమిటీల పిలుపు మేరకు సోమవారం నిర్వహించిన విద్యార్థుల నిరసన ప్రదర్శన విజయవంతంగా జరిగింది. జూలై 10న నిర్వహించనున్న రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్ను విజయవంతం చేయాలని కోరుతూ స్థానిక రైల్వే స్టేషన్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు వందలాది మంది విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నినాదాలు చేస్తూ విద్యారంగ సమస్యలపై ప్రభుత్వాలు స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు నాగకృష్ణ, పీడీఎస్యూ జిల్లా అధ్యక్షులు బుర్ర వీరభద్రం, పీడీఎస్యూ జిల్లా కార్యదర్శులు మునిగెల శివప్రశాంత్, దుగ్గం ప్రణయ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ విద్యా విధానం (ఎన్ఇపి-2020) ద్వారా విద్యను కార్పొరేటీకరణ, కాషాయీకరణ దిశగా తీసుకెళ్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ విద్యాసంస్థలకు నిధులు తగ్గించడం, విద్యారంగాన్ని ప్రైవేటీకరణ చేయడం, ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలను నిర్లక్ష్యం చేయడం వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఉన్నత విద్య అందని ద్రాక్షగా మారుతోందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని నాయకులు ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో అధ్యాపకుల కొరత, ఖాళీ పోస్టుల భర్తీ లేకపోవడం, మౌలిక సదుపాయాల లేమి, ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ల విడుదలలో జాప్యం విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వ హాస్టళ్లలో తాగునీరు, పరిశుభ్రత, మెస్ నిర్వహణ, వసతి వంటి ప్రాథమిక సౌకర్యాలు సక్రమంగా లేవని, మెస్ ఛార్జీల పెంపు చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల విలీనం, కుదింపు నిర్ణయాలను వెంటనే ఉపసంహరించుకుని ప్రతి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలను కొనసాగించాలని, అవసరమైన ప్రాంతాల్లో కొత్త పాఠశాలలను ప్రారంభించి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు అక్రమ ఫీజులు వసూలు చేయడంతో పాటు పుస్తకాలు, యూనిఫాంలు, షూస్, టైలు, బెల్టు తదితర వస్తువులను విద్యార్థులపై బలవంతంగా కొనుగోలు చేయిస్తున్నప్పటికీ ప్రభుత్వం సమర్థవంతమైన చర్యలు తీసుకోవడం లేదని నాయకులు ఆరోపించారు. ఇలాంటి అక్రమాలపై కఠిన చర్యలు తీసుకుని తల్లిదండ్రులపై పడుతున్న ఆర్థిక భారాన్ని తగ్గించాలని కోరారు. విద్యారంగ ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణను అరికట్టాలని, ప్రభుత్వ విద్యాసంస్థలకు తగిన నిధులు కేటాయించాలని, అన్ని ఖాళీ అధ్యాపక పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్లను వెంటనే విడుదల చేయాలని, నిరుద్యోగ యువతకు ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం జూలై 10న చేపట్టనున్న రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్కు విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాస్వామ్యవాదులు మద్దతు ఇచ్చి విజయవంతం చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు మాదాసు అఖిల్, రవీందర్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు తరుణ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు వినయ్, సంజయ్, పీడీఎస్యూ నాయకులు అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధురాలు మృతి ఘటనపై సీబీసీఐడీ విచారణకు బాధితుల డిమాండ్

**పోలీసులు, అధికారులు, ప్రజాప్రతినిధుల తీరుపై అనుమానాలు**




**మంథని, జులై 07(వార్త సంధ్య) :** మంథని మండలం పోతారం గ్రామంలో గత సంవత్సరం ఆగస్టు 17న జునగరి నాగమ్మ అనే వృద్ధురాలి మృతి సంచలనం సృష్టించిన ఘటనపై పూర్తి స్థాయిలో సీబీసీఐడీ విచారణ జరిపించాలని బాధిత కుటుంబ సభ్యులు జునగరి మొండి, జునగరి రాజేశ్వరి, బోగిరి జయలక్ష్మి, బోగిరి పద్మ లు డిమాండ్ చేశారు. మంగళవారం మంథని డివిజన్ మీడియా ప్రెస్ క్లబ్ కార్యా లయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ ఈ ఘటన జరిగి నప్పటి నుంచి సంబంధిత అధికారులు, పోలీసులు, ప్రజా ప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వారు ఆరోపించారు. మృతు రాలు మృతి చెందిన సమయంలో నిందితులు ఇంట్లోనే ఉన్నా, వారిపై పోలీసులు కేసు నమోదు చేయలేదని అన్నారు. ఫిర్యాదు దారులను బెదిరిస్తూ అప్పటి మంథని ఎస్ఐ దేగ రమేష్ నిందితుల పేర్లు లేకుండా ఫిర్యాదు ఇవ్వాలని తమపై ఒత్తిడి తెచ్చినట్లు వారు ఆరోపించారు. మృతి వెనుక ఉన్న వాస్తవాలను వెలికితీయడంలో పోలీసులు విఫలమయ్యారని, అన్ని కోణాల్లో దర్యాప్తు జరగడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు అధికారులను కలిసి వినతిపత్రాలు సమర్పించినప్పటికీ సరైన స్పందన లభించలేదని పేర్కొన్నారు. నోరు విప్పితే మిమ్మల్ని అందరిని చంపుతామని. ఊరంతా మా వైపే ఉన్నారంటూ నిందితులు బెదిరించారని వారు వాపోయారు. ఈ ఘటనలోని వాస్తవాలు బయటకు రాకుండా నిందితులు, చుట్టుపక్కల అందరిని వారికి అనుకూలంగా మార్చుకున్నట్లు వారు వెల్లడించారు. ఈ ఘటనపై నిష్పక్షపాత విచారణ జరిగితేనే అసలు నిజాలు బయటపడతాయని, మంథని మండలం నాగారం గ్రామ పరిధిలోని సర్వే నం. 242/ఆ/4 లోని ఎకరం భూమి పట్టా పాస్ బుక్ విషయంలో జునగరి నాగమ్మ ను హత్య చేసినట్లు కుటుంబసభ్యులు ఆరోపించారు. స్థానిక స్థాయిలో విచారణపై తమకు నమ్మకం లేదని బాధితులు తెలిపారు. అందుకే కేసును సీబీసీఐడీకి అప్పగించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ ఘటనపై మానవ హక్కుల సంఘాన్ని ఆశ్రయించిన ఇంతవరకు ఎలాంటి సమాచారం లేకుండా కేసు ముగించినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణాలకు సంబంధించిన ఇలాంటి కీలక ఘటనల్లో అధికారులు, పోలీసులు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు. ఈ ఘటనపై ప్రభుత్వం వెంటనే స్పందించి, నిజానిజాలు వెలుగులోకి వచ్చేలా స్వతంత్ర దర్యాప్తుకు ఆదేశాలు ఇవ్వాలని బాధితులు డిమాండ్ చేశారు. ఈ ఘటనపై కరపత్రాలు ముద్రించి పంపిణీ చేయనున్నట్లు జునగరి మొండి తెలిపారు.

# సింగరేణి అధికారుల దీక్షలకు జేఏసీ మద్దతు



**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూలై 08 (వార్త సంధ్య) :** సింగరేణి మైనింగ్ అధికారులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి (జేఏసీ) సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ సంఘీభావం తెలిపింది. రుద్రంపూర్లోని సింగరేణి జనరల్ మేనేజర్ కార్యాలయం ఎదుట మంగళవారం నిర్వహించిన రిలే నిరాహార దీక్షలో జేఏసీ ప్రతినిధులు పాల్గొని అధికారుల న్యాయమైన డిమాండ్లకు మద్దతు తెలిపారు. వర్క్షాప్ ఏజీఎం కలవల చంద్రశేఖరరావు ఆధ్వర్యంలో కొనసాగుతున్న దీక్షా శిబిరాన్ని షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షులు బొమ్మెర శ్రీనివాస్ సందర్శించి సంఘీభావం ప్రకటించారు. సింగరేణి మైనింగ్ అధికారుల సమస్యలను యాజమాన్యం, ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా బొమ్మెర శ్రీనివాస్ మాట్లాడుతూ, కార్మికులు, అధికారులు, యాజమాన్యం, ప్రభుత్వం పరస్పర సహకారంతో చర్చలు జరిపి సమస్యలకు శాశ్వత పరిష్కారం కనుగొనాలని సూచించారు. కార్మికుల సంక్షేమం, సంస్థ అభివృద్ధి రెండూ సమానంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కార్మిక సంక్షేమానికి చేసిన సేవలను ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. 1947లో కేంద్ర కార్మిక శాఖ మంత్రిగా ఉన్న సమయంలో కనీస వేతనం, బోనస్, జీతంతో కూడిన సెలవులు వంటి కార్మిక హక్కుల సాధనకు అంబేద్కర్ కృషి చేశారని పేర్కొన్నారు. పేదరికం దేశానికి ప్రధాన శత్రువని భావించిన అంబేద్కర్, సమాజంలో ఆర్థిక అసమానతలు తగ్గేలా ధనవంతులు పేదలకు తోడ్పాటు అందించాలని ఆకాంక్షించారని తెలిపారు. సింగరేణి వంటి ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగుల సంక్షేమం, కార్మిక హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని, అధికారుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని జేఏసీ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి జేఏసీ రాష్ట్ర కోఆర్డినేటర్ ఎనగంటి కృపాకర్, బొమ్మెర పవన్ కళ్యాణ్, ఎనగంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొని దీక్షా శిబిరానికి సంఘీభావం ప్రకటించారు.

# అగ్నిప్రమాద బాధిత కుటుంబాన్ని పరామర్శించిన వైస్ చైర్మన్



**చంద్రగొండ ప్రతినిధి, జూలై 07 (వార్త సంధ్య) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలోని అచ్యుతాపురం గ్రామంలో జరిగిన అగ్నిప్రమాదంలో పాకనాటి పోలయ్యకు చెందిన పూరి ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ప్రమాదంలో ఇంట్లోని గృహోపకరణాలు, నిత్యావసర వస్తువులు అగ్నికి ఆహుతైనట్లు సమాచారం. ఈ ఘటన విషయం తెలుసుకున్న వెంటనే అశ్వారావుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు సంఘటన స్థలానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ప్రమాదంలో జరిగిన నష్టంపై ఆరా తీసి, ప్రభుత్వ పరంగా అందే సహాయాన్ని వెంటనే అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ, బాధిత కుటుంబానికి అవసరమైన అన్ని విధాల సహాయ సహకారాలు అందేలా స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో పాటు సంబంధిత అధికారులతో మాట్లాడతానని తెలిపారు. కాంగ్రెస్ ప్రభు త్వం తరపున బాధిత కుటుంబానికి పూర్తి అండగా ఉంటామని, ప్రభుత్వ నిబంధనల మేరకు తక్షణ సహా యం అందేలా కృషి చేస్తామని చెప్పారు. అగ్నిప్రమాదానికి గల కారణాలను అధికారులు పరిశీలించి, నష్టాన్ని అంచనా వేసి తగిన సహాయ చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. ఇటువంటి ఘటనలు పున రావృతం కాకుండా ప్రజలు అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని బాధిత కుటుంబానికి సంఘీభావం తెలియజేశారు. అవసరమైన సహాయం అందించేందుకు తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

# ప్రజా సైనిక దళపతికి శ్రీశ్రీ అవార్డు.. విజయవాడలో మహమ్మద్ ముస్తఫాకు ఘన సత్కారం




**చుంచుపల్లి ప్రతినిధి జూలై 7:(వార్త సంధ్య) :** విజయవాడలో సవ్యసాచి, శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కవి సమ్మేళనంలో రామవరం పరిరక్షణ కమిటీ అధ్యక్షులు మహమ్మద్ ముస్తఫా తన సామాజిక చైతన్య కవితతో ఆకట్టుకుని శ్రీశ్రీ అవార్డు అందుకున్నారు. ప్రముఖ కవి డాక్టర్ కత్తి మండ ప్రతాప్, జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరి భూషణం, డాక్టర్ పార్థసారధి చేతుల మీదుగా అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మహమ్మద్ ముస్తఫా మాట్లాడుతూ, ప్రజా సమస్యలను విస్మరిస్తున్న రాజకీయాలపై ఆవేదన వ్యక్తం చేశారు. “ప్రజా చైతన్యానికి కలం ఒక ఖడ్గం. దాన్ని ఉపయోగించకపోతే సమాజంలో జరిగే అకృత్యాలకు పరోక్షంగా బాధ్యులమవుతాం” అని అన్నారు. ఈ సత్కారం తనకే కాకుండా రామవరం ప్రజలందరికీ దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు.

# జర్నలిస్ట్ తెల్ల హరికృష్ణను మర్యాదపూర్వకంగా కలిసిన కూకట్పల్లి కాంగ్రెస్ నూతన అధ్యక్షుడు కావేటి నాగార్జున



**వార్తా సంధ్య కూకట్పల్లి :** కూకట్పల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన కావేటి నాగార్జున మంగళవారం భాగ్యనగర్ కాలనీలోని కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర బీసీ నాయకులు, ప్రముఖ జర్నలిస్టు తెల్ల హరికృష్ణను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా కావేటి నాగార్జునకు తెల్ల హరికృష్ణ శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సన్మానించారు. నూతన పదవిని అధిష్టించిన ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు మరియు అభినందనలు తెలియజేశారు. డివిజన్ పరిధిలో పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నాగార్జున చురుగ్గా పనిచేయాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రశాంత్ నగర్ డివిజన్ సీనియర్ నాయకులు ఎం. వెంకట రమణ, రాకేష్, భాను, అవినాష్ తదితరులు పాల్గొని నూతన అధ్యక్షుడికి తమ మద్దతును తెలుపుతూ శుభాకాంక్షలు అందజేశారు.

# ఓటు మ్యాపింగ్ ‘సర్’ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి: మాజీ కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్



**వార్తా సంధ్య కూకట్పల్లి :** ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మ బండ పరిధిలోని దత్తాత్రేయ నగర్ కాలనీలో ఎన్నికల కమిషన్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ‘సర్’ ఓటు మ్యాపింగ్ కార్యక్రమాన్ని డివిజన్ మాజీ కార్పొ రేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ స్థానిక నాయకులతో కలిసి పరిశీ లించారు. బూత్ లెవెల్ అధి కారులు (బీఎల్ఓలు) నిర్వ హిస్తున్న సర్వే తీరును ఆయన దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ... ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయాలంటే ప్రతి అర్హత కలిగిన పౌరుడు ఓటరుగా నమోదు కావడం అత్యంత ముఖ్యమన్నారు. బీఎల్ఓలు అందజేసే ఎమ్యూనరేషన్ ఫారంలో ప్రజలు తమ పూర్తి వివరాలను సక్రమంగా నమోదు చేసుకుని ఓటు హక్కును పరిరక్షించుకోవాలని సూచించారు. అధికారులు ఈ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని, ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఉన్న ఓట్లను, నకిలీ ఓట్లను గుర్తించి పూర్తిగా తొలగించేందుకు కృషి చేయాలని కోరారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు ప్రజల్లో అవగాహన కల్పించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పోశెట్టిగౌడ్, జగదీష్, సత్యనారాయణ, అశోక్, రామకృష్ణ, మోసిన్, రవీందర్లతో పాటు బీఎల్ఓలు అరుణ కుమారి, శైలజ, వరలక్ష్మి, పద్మ, రుద్రాణి, వాణి, రజిత, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

# జనసేన కార్యకర్త ప్రసాద్ను పరామర్శించిన ముమ్మారెడ్డి ప్రేమ కుమార్



**వార్తా సంధ్య కూకట్పల్లి :** కూకట్పల్లి నియోజకవర్గ జనసేన పార్టీ కంటెస్ట్ ఎమ్మెల్యే అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ మంగళవారం మోతీనగర్లోని లీలా హాస్పిటల్ను సందర్శించారు. గత రెండు రోజులుగా న్యూరో సంబంధిత సమస్యతో చికిత్స పొందుతున్న అల్లాపూర్కు చెందిన జనసేన కార్యకర్త ప్రసాద్ను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రేమ కుమార్ ప్రసాద్ ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో మాట్లాడారు. ప్రస్తుతం అందుతున్న చికిత్స, చేయాల్సిన వైద్య పరీక్షలు, మందులు మరియు రికవరీ ప్రక్రియ గురించి పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రసాద్కు అవసరమైన అన్ని వైద్య సేవలు త్వరితగతిన అందేలా చూడాలని ఆసుపత్రి సిబ్బందికి సూచించారు. అనంతరం ప్రసాద్తో కాసేపు మాట్లాడి, ఆయనకు మానసిక ధైర్యాన్ని నూరిపోశారు. పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు జనసేన అండగా ఉంటుంది. ప్రసాద్ కుటుంబానికి పార్టీ తరపున ఎల్లప్పుడూ పూర్తి మద్దతు, అవసరమైన సహాయం అందిస్తాం. అలాగే నియోజకవర్గ నాయకులు కొల్లా శంకర్, వేముల మహేష్ కూడా ప్రసాద్తో మాట్లాడి, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

# సార్ ప్రక్రియ పురోగతి






**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య)జూలై 07:** సర్ కార్యక్రమంలో భాగంగా అడిషనల్ సీఈవో శ్రీ వాసం వెంకటేశ్వర్లు రెడ్డి, ఐఏఎస్ మంగళవారం నాడు మహేశ్వరం నియోజకవర్గం జల్ పల్లి, మీర్ పేట్, ఎల్.బి.నగర్ నియోజకవర్గంలోని సరూర్ నగర్ ప్రాంతాలలో పర్యటించి కొనసాగుతున్న " సర్ " ప్రక్రియ పురోగతిని పరిశీలించారు. సర్ కార్యక్రమంలో ఎలాంటి లోటు పాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని బి ఎల్ ఓలను సూపర్వైజర్లను ఆదేశించారు. ఎనుమరేషన్ ఫారం నింపడంలో సూపర్వైజర్లు ముఖ్య పాత్ర పోషించాలన్నారు. ఫారాల నింపడంలో బి ఎల్ ఓలకు సహకరించాలన్నారు. ఆవసరమైన చోట్ల వాలంటీర్ల సేవలను వాడుకొని ఎన్యుమరేషన్ ఫారాలు తప్పులు లేకుండా నింపడంలో ఒటర్లకు సహకరించాలని సుపర్వైజర్లకు బి ఎల్ ఓలను ఆదేశించారు. ఎనుమరేషన్ ఫారంలో ఒటరు సంతకం తో పాటు ఫోటో ఉండేలా చూడాలని అదనపు సి.ఇ.ఒ బి ఎల్ ఓలను ఆదేశించారు. పర్యటనలో భాగంగా జల్పల్లిలో 32 చోట్ల రోహింగ్యాలు నివసిస్తున్న ప్రాంతా లను పర్యటించి వారిని గుర్తించారు.ఈ పర్యటనలో ఈ ఆర్వో, బి ఎల్ ఓ లు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణిలో మెటీరియల్ కొరత వెంటనే తీర్చాలి ఎఐటియుసి డిమాండ్



**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూలై 08 (వార్త సంధ్య) :** సింగరేణి వ్యాప్తంగా గనులు, ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులు, వివిధ విభాగాల్లో కార్మికుల భద్రతతో పాటు ఉత్పత్తి కార్యకలాపాలకు అవసరమైన మెటీరియల్ కొరతను వెంటనే తీర్చాలని గుర్తింపు కార్మిక సంఘం ఎఐటియుసి యాజమాన్యాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ పిలుపు మేరకు మంగళవారం కార్పొరేట్ ఏరియాలోని సెంట్రల్ వర్క్‌షాప్, మెయిన్ వర్క్‌షాప్, సివిల్, అన్వేషణ విభాగాల్లో బ్రాంచ్ కార్యదర్శి ఎస్.వి. రమణమూర్తి ఆధ్వర్యంలో సంబంధిత విభాగాధిపతులకు (హెచ్‌ఓడీలు) మెమొరాండాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్.వి. రమణమూర్తి మాట్లాడుతూ, గనుల్లో పనిచేసే కార్మికుల భద్రతకు అవసరమైన పరికరాలు, విడిభాగాలు, రక్షణ సామగ్రి, ఇతర మెటీరియల్ కొరత కారణంగా విధుల నిర్వహణలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. అవసరమైన సామగ్రి సకాలంలో అందుబాటులో లేకపోవడం వల్ల ఉత్పత్తి పనులు కూడా ప్రభావితమవుతున్నాయని పేర్కొన్నారు. సింగరేణి యాజమాన్యం కార్మికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, అన్ని విభాగాల్లో అవసరమైన మెటీరియల్‌ను తక్షణమే సమకూర్చాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిష్కరించే చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి ఉపాధ్యక్షులు క్రిస్టోఫర్, సహాయ కార్యదర్శి రాము, పిట్ కార్యదర్శులు సుధీర్, నరేష్, రమేష్, బండి సదానందం, దావా వెంకటేశ్వర్లు, పుల్లచారి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ వాసులకు శుభవార్త.. తిరుపతి, అరుణాచలం, శ్రీరంగానికి నేరుగా రైలు!

**హైదరాబాద్ నుంచి దక్షిణ భారత పుణ్యక్షేత్రాలకు కొత్త రైలు**

**చెర్లపల్లి-తిరుచ్చి మధ్య వారానికి ఒకసారి ప్రత్యేక సర్వీస్**

**తిరుపతి, అరుణాచలం, శ్రీరంగం క్షేత్రాలకు నేరుగా ప్రయాణం**

**ప్రతి మంగళవారం చెర్లపల్లి నుంచి బయలుదేరనున్న రైలు**

**ఏసీ, స్లీపర్, జనరల్ కోచ్‌లతో కూడిన 22 బోగీల రైలు**

IRCTC

దక్షిణ భారతదేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలైన తిరుపతి, అరుణాచలం (తిరువణ్ణామలై), శ్రీరంగం సందర్శించాలనుకునే భక్తులకు దక్షిణ మధ్య రైల్వే శుభవార్త అందించింది. హైదరాబాద్‌లోని చెర్లపల్లి నుంచి తిరుచ్చి (తిరుచిరాపల్లి) వరకు నూతన వీక్లీ ప్రత్యేక రైలు సేవలను మంగళవారం నుంచి ప్రారంభించింది. ఈ రైలు సౌకర్యంతో భక్తులు ఒకే ప్రయాణంలో ఈ మూడు ముఖ్యమైన క్షేత్రాలను ఎంతో సులభంగా సందర్శించుకోవచ్చు. రైలు నంబర్ 17077 ప్రతి మంగళవారం సాయంత్రం 5:20 గంటలకు చెర్లపల్లిలో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 8:50 గంటలకు తిరుపతికి, మధ్యాహ్నం 1:20 గంటలకు తిరువణ్ణామలైకి, సాయంత్రం 4:30 గంటలకు శ్రీరంగానికి చేరుకుంటుంది. అనంతరం సాయంత్రం 6:45 గంటలకు తిరుచిరాపల్లికి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో, రైలు నంబర్ 17078 ప్రతి బుధవారం రాత్రి 9:30 గంటలకు తిరుచ్చిలో బయలుదేరి, మరుసటి రోజు రాత్రి 10:20 గంటలకు చెర్లపల్లికి చేరుకుంటుంది. హైదరాబాద్ నుంచి తిరుపతికి ఇప్పటికే సుమారు 20 రైళ్లు అందుబాటులో ఉన్నప్పటికీ, అరుణాచలానికి నేరుగా రైలు సౌకర్యం కల్పించాలని భక్తులు చాలాకాలంగా కోరుతున్నారు. ఈ కొత్త సర్వీసు ప్రారంభంతో వారి చిరకాల కోరిక నెరవేరినట్లయింది. మొత్తం 22 కోచ్‌లతో నడిచే ఈ రైలులో 3 సెకండ్ ఏసీ, 5 థర్డ్ ఏసీ, 10 స్లీపర్ క్లాస్, 4 జనరల్ సెకండ్ క్లాస్ బోగీలు అందుబాటులో ఉన్నాయి.

## సింగరేణికి మరో 2 బొగ్గు బ్లాక్‌ల కేటాయింపు.. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రకటన

**సింగరేణికి నైనీ కోల్ బ్లాక్**

**తాడిచెర్ల-2 బ్లాక్ కూడా కేటాయింపు**

**బొగ్గు ఉత్పత్తి పెంచాలని సూచన**

**నైనీలో 35 ఏళ్లకు సరిపడా నిల్వలు**

**రూ.75 వేల కోట్ల ఆదాయం అంచనా**

సింగరేణికి మరో రెండు కీలక బొగ్గు బ్లాక్‌లు దక్కనున్నాయి. ఒడిశాలోని నైనీ కోల్ బ్లాక్‌తో పాటు తాడిచెర్ల-2 కోల్ బ్లాక్‌ను కూడా సింగరేణికి కేటాయిస్తున్నట్లు కేంద్ర బొగ్గు శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి ప్రకటించారు. ఈ నిర్ణయం సంస్థ భవిష్యత్తుకు పెద్ద ఊరటనిస్తుందని చెప్పారు. ఢిల్లీలో మంగళవారం మాట్లాడిన కిషన్ రెడ్డి సింగరేణికి కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తోందన్నారు. బొగ్గు ఉత్పత్తిని మరింత పెంచాల్సిన అవసరం ఉందని సూచించారు. ఒడిశాలోని నైనీ కోల్ బ్లాక్ సింగరేణికి దక్కేలా కేంద్రం చొరవ తీసుకుందని వెల్లడించారు. ఇతర రాష్ట్రాల్లో జరిగే బొగ్గు బ్లాక్‌ల వేలంలోనూ సింగరేణి పాల్గొనేలా తన వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. నైనీ కోల్ బ్లాక్‌లో మరో 35 ఏళ్లకు సరిపడా బొగ్గు నిల్వలు ఉన్నాయని కిషన్‌రెడ్డి చెప్పారు. దీని వల్ల సింగరేణికి సుమారు రూ.75 వేల కోట్ల ఆదాయం వచ్చే అవకాశం ఉందని అంచనా వేశారు. తెలంగాణలో లక్షలాది కుటుంబాల జీవనాధారం సింగరేణి అని పేర్కొన్నారు. తాడిచెర్ల-2 కోల్ బ్లాక్‌ను కూడా సింగరేణికే కేటాయించాలని కేంద్రం నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. ఈ బ్లాక్‌తో సంస్థ కార్యకలాపాలు మరింత బలోపేతం అవుతాయన్నారు. భవిష్యత్తులో ఉత్పత్తి పెరగడానికి ఇది దోహదపడుతుందని తెలిపారు.

# తీవ్ర పని ఒత్తిడితో సింగిల్ విండో' సీఈఓ గుండెపోటుతో ఆకస్మిక మృతి!

**అధికారుల టార్గెట్లు, కొనుగోలు కేంద్రాల నిర్వహణ ఒత్తిడే కారణం భార్య అర్చన**

**సహకార సంఘాల సిబ్బందిని వెంటాడుతున్న గుండెపోటు మరణాలు**

**మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని సహోద్యోగుల డిమాండ్**

**మంథని, జూలై 07(వార్త సంధ్య) :** గ్రామీణ రైతులకు, వ్యవసాయ రంగానికి అహర్నిశలు సేవలందించే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సింగిల్ విండో ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ, కార్యదర్శి) తీవ్ర గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. గత కొన్ని రోజులుగా అటు ప్రభుత్వ అధికారుల నిర్దేశిత టార్గెట్లు, ఇటు క్షేత్రస్థాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ, లోన్ రికవరీల ఒత్తిడి కారణంగా ఆయన తీవ్ర మానసిక ఆందోళనకు గురైనట్లు తెలుస్తోంది. విధులు ముగించుకుని ఇంటికి వెళ్లిన తర్వాత ఒక్కసారిగా గుండెనొప్పి రావడంతో భారీ అర్చన, కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించే లోపే ఆయన తుదిశ్వాస విడిచారు.

**ఊపిరి సల్పని విధులు.. ప్రాణాలు తీస్తున్న ఒత్తిళ్లు!**

సహకార సంఘాల సిబ్బంది పరిస్థితి ప్రస్తుతం 'కత్తి మీద సాము'లా మారింది. నాలుగు విభిన్న ప్రభుత్వ శాఖల (సహకార, వ్యవసాయ, పౌరసరఫరాల, బ్యాంకు అధికారులు) సమన్వయంతో పాటు, స్థానిక రాజకీయ ఒత్తిళ్ల నడుమ వీరు నలిగిపోతున్నారు.



క్యాలెండర్ నిండా సీజన్ల వారీగా టార్గెట్లు ఉండటం, ఏ ఒక్క రోజు కూడా వీకెండ్ సెలవు లేకుండా విధులు నిర్వహించాల్సి రావడం వల్ల సిబ్బంది శారీరకంగా, మానసికంగా తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారు. ఈ క్రమంలోనే విధి నిర్వహణలో నిరంతరం సతమతమవుతూ, సకాలంలో విశ్రాంతి లేకపోవడంతో గుండెపోటుతో ప్రాణాలు కోల్పోవాల్సి వస్తోందని సహోద్యోగులు కన్నీటి పర్యంతమయ్యారు.

**ప్యాక్స్ సిబ్బంది దిగ్భ్రాంతి.. ప్రభుత్వం ఆదుకోవాలని వినతి**

సీఈఓ అకాల మృతి పట్ల తోటి సహకార సంఘాల కార్యదర్శులు, సిబ్బంది మరియు స్థానిక రైతాంగం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నిరంతరం ప్రజా సేవలో ఉంటూ, నిబంధనల ప్రకారం విధులను సక్రమంగా నిర్వహించే ఒక సమర్థుడైన అధికారిని కోల్పోవడం సహకార రంగానికి తీరని లోటని పేర్కొన్నారు. ప్రభుత్వం మరియు సహకార శాఖ ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి, క్షేత్రస్థాయి సిబ్బందిపై ఉన్న అదనపు పని భారాన్ని మరియు మానసిక ఒత్తిడిని తగ్గించడానికి తగిన చర్యలు తీసుకోవాలని, మరణించిన సీఈఓ కుటుంబానికి తక్షణమే ప్రభుత్వ పరంగా ఆర్థిక సాయం అందించి, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. మృతుడి భౌతికకాయానికి స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ సహకార సంఘాల నాయకులు, రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. వారి కుటుంబ సభ్యులకు తమ గాఢ సానుభూతిని తెలియజేశారు.

# గురుకులాలు, హాస్టళ్లలో క్లీన్ అండ్ గ్రీన్ కు ప్రాధాన్యం,మెనూ అమలులో రాజీ ఉండొద్దు

**బీసీ స్టడీ సర్కిల్స్ బలోపేతానికి ప్రత్యేక కమిటీ**

**జూలై 16 నుంచి కులవృత్తుల మేళా.. అన్ని కులాలకు అవకాశం**

**స్కిల్ డెవలప్మెంట్‌తో బీసీలకు మరిన్ని ఉపాధి అవకాశాలు**

**ఎకనామిక్ సపోర్ట్ స్కీమ్స్‌పై అధ్యయనం చేయాలి**

**బీసీ సంక్షేమ శాఖలో సంక్షేమం, నాణ్యత, ఉపాధి కల్పనకు ప్రాధాన్యత**

**బీసీ సంక్షేమ శాఖ ఉన్నతాధికారులతో**

**సమీక్షా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్**

**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య)జూలై 7 :** గురుకులాలు, హాస్టళ్లు ప్రారంభమై 20 రోజులు పూర్తైన నేపథ్యంలో గత సమీక్షా సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలుపై బీసీ సంక్షేమ శాఖకు సంబంధించిన కార్యక్రమాలపై సచివాలయంలో రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గురుకులాలు, హాస్టళ్లు పరిశుభ్రంగా, పచ్చదనంతో కూడిన క్లీన్ అండ్ గ్రీన్ వాతావరణంలో ఉండేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్ణయించిన మెనూను అన్ని గురుకులాలు, హాస్టళ్లలో



తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. జిల్లా బీసీ సంక్షేమ అధికారులు (డీబీసీవోలు) క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ విద్యార్థుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు తరచూ గురుకులాలు, హాస్టళ్లను సందర్శించి విద్యార్థుల పరిస్థితులను స్వయంగా పరిశీలించాలని సూచించారు.స్టడీ సర్కిల్స్‌లో మరింత నాణ్యత పెంపొందించేందుకు, సివిల్స్‌తో పాటు వృత్తి శిక్షణ, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. ఢిల్లీ, అహ్మదాబాద్ వంటి ఇతర రాష్ట్రాల్లో విజయవంతంగా అమలవుతున్న స్టడీ సర్కిల్స్ విధానాలను అధ్యయనం చేసి రాష్ట్రంలో అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని అధి కారులను ఆదేశించారు. జూలై 16 నుంచి హెచ్‌ఎండీఏ గ్రౌండ్స్ లో నిర్వహించనున్న కులవృత్తుల మేళాలో అన్ని కులాల సంప్రదాయ వృత్తిదారులకు సమాన అవకాశాలు కల్పించాలని సూచించారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు తోడ్పడే కుట్టు మిషన్ పథకం అమలు కోసం సమగ్ర విధి విధానాలను రూపొందించాలని ఆదేశించారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టి ఉపాధి అవకాశాలను పెంచాలని, ఎకనామిక్ సపోర్ట్ స్కీమ్స్‌పై సమగ్ర అధ్యయనం చేసి అమలుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ఐఐటీలు, ఐఐఎంలలో సీట్లు సాధించిన గురుకుల విద్యార్థులకు అందించే ల్యాప్ టాప్‌ల పంపిణీపై సమగ్ర నివేదిక సమర్పించాలని మంత్రి ఆదేశించారు. బీసీ సంక్షేమ శాఖ కమిషనర్, గురుకులాల కార్యదర్శి ఆకస్మికంగా గురుకులాలు, హాస్టళ్లను తనిఖీ చేస్తూ విద్యార్థులకు నాణ్యమైన సౌకర్యాలు అందుతున్నాయో లేదో నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. కాటమయ్య రక్షణ కవచాల శిక్షణ పూర్తి చేసుకొని కిట్లు అందని జిల్లాల్లో వెంటనే పంపిణీ పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బాలమయదేవి, గురుకులాల కార్యదర్శి సైదులు, బీసీ సంక్షేమ శాఖ అధికారులు మల్లయ్య బట్టు, అలోక్ కుమార్, మామిడి హరికృష్ణ, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రహదారుల రోడ్డు విస్తరణ పనులు

**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) జూలై 7 :రంగారెడ్డి జిల్లా** రూ.338 కోట్లతో ఇబ్రహీంపట్నం, మేడ్చల్, మహేశ్వరం నియోజక వర్గాల్లో నాలుగు లేన్ల ఆధునిక రహదారుల నిర్మాణానికి శంకు స్థాపన - రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి. రూ.338 కోట్ల వ్యయంతో ఇబ్రహీంపట్నం, మేడ్చల్, మహేశ్వరం నియోజకవర్గాల్లో హైబ్రిడ్ అన్యుటీ మోడల్ విధానంలో చేపట్టనున్న ఆధునిక నాలుగు లేన్ల రహదారుల నిర్మాణ పనులకు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఈటల రాజేందర్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి పాల్గొన్నారు. అనంతరం





నిర్వహించిన సభలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ, ఇబ్రహీంపట్నం ప్రజలు, కార్యకర్తలు, నాయకులు తనపై ఉంచిన విశ్వాసం వల్లే రాష్ట్రంలో కీలకమైన రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా సేవ చేసే అవకాశం లభిం చిందన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడం తన బాధ్యత అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రహదారుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఇప్పటికే రూ.85 కోట్ల విలువైన రహదారి పనులు పూర్తి చేశామని, మరో రూ.275 కోట్లతో పలు రహదారి అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. అదనంగా రూ.100 కోట్ల విలువైన కొత్త రహదారి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధి,కారులను ఆదేశించినట్లు వెల్లడించారు. పార్టీలు వేర్వేరు అయి నప్పటికీ అభివృద్ధి విషయంలో అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, జాతీయ రహదారుల విస్తరణ, వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తూ తెలంగాణను మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని మంత్రి స్పష్టం చేశారు. పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో రూ.338 కోట్లతో 140కు పైగా రహదారి పనులు చేపట్టినట్లు తెలిపారు. గ్రామాలు, బస్తీల్లో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విద్య, వైద్యం, మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించిందని, ప్రభుత్వ పాఠశాలలను ఆధునిక తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌గా తీర్చిదిద్దుతున్నట్లు పేర్కొన్నారు. లక్ష్మీరెడ్డిపాలెం వద్ద ఫ్లైఓవర్, అండర్‌పాస్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ, ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి రూ.338 కోట్ల విలువైన రహదారి పనులు మంజూరు కావడం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. ఇందులో సుమారు రూ.275 కోట్ల పనులు నేరుగా ఇబ్రహీంపట్నం పరిధిలో చేపడుతున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో నియోజకవర్గంలో 200 పడకల ఆసుపత్రి, ప్రభుత్వ పాఠశాలల ఆధునీకరణ, రహదారుల విస్తరణ వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. అలాగే రూ.2,300 కోట్లతో సమీకృత మార్కెట్ ఏర్పాటు ద్వారా వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి కూడా సమాన ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రోడ్లు, భవనాల శాఖ ద్వారా భారీ స్థాయిలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రధాన రహదారులను నాలుగు లేన్లుగా అభివృద్ధి చేయడం ద్వారా రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు ఉపాధి, పెట్టుబడులు, ప్రాంతీయ అభివృద్ధికి ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, రంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్ చంద్రారెడ్డి, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యం

**రూ.360 కోట్లతో రెవెన్యూ శాశ్వత భవనాలు**

**10 ఆర్డీవో,107 తహాశీల్దార్, 53 సబ్ రిజిస్ట్రార్ భవనాల నిర్మాణం**

**- రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) జులై 7 :** రాష్ట్రంలో రెవెన్యూ పరిపాలనను మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు ఆధునిక, గౌరవప్రదమైన సేవలు అందించాలనే లక్ష్యంతో దశలవారీగా తహసీల్దార్, ఆర్డీవో, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాల నిర్మాణాన్ని ప్రభుత్వం వేగవంతం చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార ఀ పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. భవనాల నిర్మాణాలపై మంగళవారం నాడు అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలివిడతలో అద్దె భవనాలు, శిథిలావస్థలో ఉన్న 107 తహసీల్దార్ కార్యాలయాలు, 10 ఆర్డీవో కార్యాలయాలకు 263 కోట్ల రూపాయిలతో అలాగే స్టాంప్స్ ఀ రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించి రూ.97 కోట్ల రూపాయిలతో 48 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, ఆదిలాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాలు, నిజామాబాద్, వరంగల్



జిల్లాల్లో డీఐజీ కార్యాలయాలను నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. ఈ మొత్తం భవనాల కోసం రెండు విభాగాలకు సంబంధించి 360 కోట్ల రూపాయిలతో పరిపాలనా అనుమతులు జారీ చేసినట్లు తెలిపారు. ఈ భవనాలన్నీ ఒకే నమూనాలో, ఆధునిక సౌకర్యాలతో నిర్మించి ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించేలా రూపొందిస్తామని చెప్పారు. వీటి నిర్మాణ బాధ్యతను తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్‌కు అప్పగించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. అద్దె భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు కొనసాగడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్న పరిస్థితికి శాశ్వత పరిష్కారం చూపేందుకు ఈ చర్యలు చేపడు తున్నామని తెలిపారు. హౌసింగ్ అధికారులు జిల్లా స్థాయిలో రెవెన్యూ అధికారు లతో సమన్వయం చేసుకొని కొత్త భవనాల నిర్మాణానికి అవసరమైన స్థలా లను గుర్తించి నిర్మాణ పనులను వేగంగా ప్రారంభించాలని అధి కారులను ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ, రిజిస్ట్రేషన్ సేవలందించే కార్యా లయాలు ప్రజలకు సులభంగా అందు బాటులో ఉండేలా, భవిష్యత్ అవస రాలకు అనుగుణంగా నిర్మించబడతాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. ఇప్పటికే ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 13 క్లస్టర్లుగా విభజించి ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను నిర్మిస్తున్నామని ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థిక భారం పడకుండా ప్రైవేటు నిర్మాణ రంగ సంస్థలతో నిర్మిస్తున్నామని తెలిపారు. ఐదు సంవత్సరాల నిర్వహణా బాధ్యతను కూడా ఆ సంస్థలే తీసుకున్నాయని ఇప్పటికే నాలుగు ప్రాంతాల్లో ఇంటిగ్రేటెడ్ భవనాలకు శంకుస్థాపన చేయగా నిర్మాణపనులు చురుగ్గా సాగుతున్నాయని మంత్రి పొంగులేటి తెలిపారు.




# గూడెంలో స్వేచ్ఛగా మట్కా...

**కిరాణా, బెల్ట్ షాపులే అడ్డా..!**

**1000 మందికి పైగా బుక్కీలు..!**

**జీవితాలను అతలాకుతలం చేస్తున్న మట్కా వ్యాపారం**

**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూలై 07 (వార్త సంధ్య) :** కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలో మట్కా వ్యాపారం రోజురోజుకూ విస్తరిస్తోందని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు రహస్యంగా కొంతమంది వ్యక్తులకే పరిమితమైన ఈ అక్రమ జూదం ప్రస్తుతం పట్టణంలోని అనేక ప్రాంతాలకు విస్తరించిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా కిరాణా దుకాణాలు, బెల్ట్ షాపులు, పాన్ డబ్బాలు, చిన్న వ్యాపార కేంద్రాలను అడ్డాగా చేసుకుని మట్కా బుక్కీలు బహిరంగంగానే కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం లేదా తగిన స్థాయిలో చర్యలు తీసుకోకపోవడం వల్ల ఈ అక్రమ వ్యాపారం మరింతగా విస్తరిస్తోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొత్తగూడెంతో పాటు సమీప గ్రామాలు, కాలనీలు, కార్మిక ప్రాంతాలు, గనుల పరిసరాల్లో కూడా మట్కా నెట్‌వర్క్ బలపడినట్లు సమాచారం. రోజూ వేలాది మంది చిన్న మొత్తాల నుంచి పెద్ద మొత్తాల వరకు డబ్బులు పెట్టి అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. త్వరగా డబ్బు సంపాదించాలనే ఆశతో యువకులు, కూలీలు, ఆటో డ్రైవర్లు, ప్రైవేట్ ఉద్యోగులు, చిన్న వ్యాపారులు ఈ జూదంలోకి అడుగుపెడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఒకసారి ఈ అలవాటు పట్టుకున్న తర్వాత బయటపడటం చాలా మందికి కష్టంగా మారుతోందని ఆవేదన వ్యక్తమవుతోంది. స్థానికుల వాదన ప్రకారం, కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోనే ప్రత్యక్షంగా, పరోక్షంగా వెయ్యి మందికి పైగా బుక్కీలు పనిచేస్తున్నారని చెబుతున్నారు. వీరిలో కొందరు నేరుగా కూపన్లు రాస్తుండగా, మరికొందరు మొబైల్ ఫోన్లు, మెసేజింగ్ యాప్‌ల ద్వారా నంబర్లు సేకరించి ప్రధాన నిర్వా హకులకు పంపిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ప్రతి కాలనీలో ఒకరిద్దరు బుక్కీలు ఉండే పరిస్థితి ఏర్పడిందని, ఉదయం నుంచి రాత్రి వరకు మట్కా లావాదేవీలు కొనసాగుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. మట్కా వ్యాపారం వెనుక భారీ ఆర్థిక లావాదేవీలు జరుగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రతిరోజూ లక్షల రూపాయలు చేతులు మారుతున్నప్పటికీ, గెలిచే వారు చాలా తక్కువ మంది మాత్రమేనని, ఎక్కువ మంది తమ కష్టార్జిత డబ్బును కోల్పోతున్నారని చెబుతున్నారు. మొదట చిన్న మొత్తాలతో ప్రారంభించిన వారు, నష్టాలను పూడ్చుకోవాలనే ఆశతో మరింత పెద్ద మొత్తాలు పెట్టి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని కుటుంబ సభ్యులు వాపోతున్నారు. ఈ వ్యసనం కారణంగా అనేక కుటుంబాల్లో ఆర్థిక సంక్షోభం నెలకొంటోందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజువారీ కూలి సంపాదనలో కొంత భాగం కాకుండా, మొత్తం సంపాదననే మట్కాకు ఖర్చు చేసే పరిస్థితులు ఉన్నాయని, దీంతో ఇంటి ఖర్చులు, పిల్లల చదువులు, వైద్య అవసరాలు కూడా నిర్లక్ష్యానికి గురవుతున్నాయని అంటున్నారు. అప్పులు పెరిగి వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి వస్తోందని, చివరకు కుటుంబ కలహాలు, మానసిక ఒత్తిడులు పెరుగుతున్నాయని పేర్కొంటున్నారు. యువతలో మట్కా వ్యసనం మరింత ఆందోళన కలిగిస్తోందని సామాజిక వర్గాలు చెబుతున్నాయి. ఉద్యోగాల కోసం ప్రయత్నించాల్సిన వయస్సులో సులభంగా డబ్బు వస్తుందనే ఆశతో జూదానికి అలవాటు పడుతున్నారని అంటున్నారు. కొందరు విద్యార్థులు కూడా ఈ వ్యసనానికి బానిసలవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇది భవిష్యత్ తరాలపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని సామాజిక కార్యకర్తలు హెచ్చరిస్తున్నారు. స్థానికుల ఆరోపణల ప్రకారం, మట్కా బుక్కీలు కిరాణా దుకాణాలు, బెల్ట్ షాపులు, పాన్ షాపులు వంటి సాధారణ వ్యాపారాల ముసుగులో తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని చెబుతున్నారు. బయటకు చూస్తే సాధారణ దుకాణాల్లా కనిపించినా, లోపల మాత్రం మట్కా లావాదేవీలు జరుగుతున్నాయని ఆరోపిస్తున్నారు. కొన్నిచోట్ల ప్రత్యేక సమయాల్లో మాత్రమే నంబర్లు నమోదు చేస్తుండగా, మరికొన్ని చోట్ల రోజంతా ఈ వ్యవహారం కొనసాగుతోందని స్థానికులు చెబుతున్నారు. ప్రజల నుంచి పలుమార్లు ఫిర్యాదులు వెళ్లినా, కొద్దిరోజులు మాత్రమే చర్యలు కనిపించి మళ్లీ యథావిధిగా వ్యాపారం కొనసాగుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. అక్రమ జూదాన్ని అరికట్టేందుకు తరచూ ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి, నిర్వాహకులతో పాటు బుక్కీలపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే అక్రమ కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్న వ్యాపార సంస్థలపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. మట్కా వ్యాపారాన్ని పూర్తిగా నిర్మూలించాలంటే కేవలం పోలీసు శాఖ చర్యలతో సరిపోదని, ఎక్సైజ్, రెవెన్యూ, మున్సిపల్ యంత్రాంగం, స్థానిక ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. గ్రామాలు, కాలనీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి జూదం వల్ల కలిగే నష్టాలపై ప్రజలకు వివరించాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, క్రీడలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల వైపు

# మత్స్యకారుల కోసం మూడో రోజూ సెర్చ్ ఆపరేషన్

**సహాయక చర్యలపై సీఎం చంద్రబాబు ఆరా**

**గాలింపు చర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్న సీఎం చంద్రబాబు**

**మత్స్యకారుల గల్లంతు ఘటనపై విశాఖ వన్‌టౌన్ పీఎస్‌లో కేసు నమోదు**

**తీరం నుంచి 12 నాటికల్ మైళ్ల పరిధి వరకు గాలింపు**



మత్స్యకారుల కోసం జరుగుతున్న గాలింపు చర్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు నిశితంగా పర్యవేక్షిస్తున్నారు. మత్స్యకారుడు కర్రి చిన్న అందించిన కీలక సమాచారం ఆధారంగా గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. గల్లంతైన మత్స్యకారుల కోసం నావికాదళం తీరరక్షక దళం నౌకలు, హెలికాప్టర్లతో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. రెండు నావికాదళ హెలికాప్టర్లు, తీరరక్షక దళ నౌకలు, మెరైన్ పోలీస్ బృందాలు ఈ గాలింపులో పాల్గొంటున్నాయి. పడవ బోల్తా పడిన గంగవరం తీర ప్రాంతం, తీరం నుంచి 12 నాటికల్ మైళ్ల పరిధి వరకు గాలింపు ప్రాంతాన్ని విస్తరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ఈ గాలింపు , సహాయక చర్యల కోసం తూర్పు నావికాదళ కమాండ్ రెండు యుద్ధనౌకలను, రెండు హెలికాప్టర్లను రంగంలోకి దించిందని తీరప్రాంత భద్రతా విభాగం ఐజీ గోపీనాథ్ జెట్టి ముఖ్యమంత్రికి వివరించారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులు, ముఖ్యంగా ఎత్తైన అలలు, బలమైన గాలులు గాలింపు చర్యలకు ఆటంకం కలిగిస్తున్నాయని అధికారులు తెలిపారు. గల్లంతైన ఆరుగురు మత్స్యకారులను త్వరగా గుర్తించాలని, వారి కుటుంబాలకు అవసరమైన సహాయం అందించాలని ముఖ్యమంత్రి యంత్రాంగాన్ని ఆదేశించారు. సహాయక చర్యల పురోగతిపై ఎప్పటికప్పుడు తనకు సమాచారం అందించాలని కూడా ఆయన అధికారులకు సూచించారు. హోం మంత్రి అనిత మంత్రి అచ్చెన్నాయుడు క్షేత్రస్థాయిలో పరిస్థితిని పర్యవేక్షిస్తూ సమన్వయం చేస్తున్నారు. మత్స్యకారులు గల్లంతైన ఘటనపై విశాఖపట్నం వన్-టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. గల్లంతైన మత్స్యకారుడు బండయ్య భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ పి. వరప్రసాద్ 'మిస్సింగ్ పర్సన్' (గల్లంతైన వ్యక్తి) కేసుగా (కేసు నం. 109/2026) నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**గల్లంతైన వారి వివరాలు :**

ఈ నెల 1న చేపల వేటకు వెళ్లి తిరిగి వస్తుండగా ఆ పడవ బోల్తా పడింది.
ఒకరిని సురక్షితంగా రక్షించగా, మరో ఆరుగురు గల్లంతయ్యారు.
రాగితి బండయ్య (43)
కర్రి గరగయ్య (24)
మేడ చిన అమ్మోరు (48)
కర్రి సీతోడు (55)
కర్రి చిన్నయ్య (32)
అమర అప్పలరాజు (24)

ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా ఈ ప్రమాదం జరిగినట్లు గుర్తించారు.

గాలింపు చర్యల తాజా సమాచారం: మొత్తం 72 గంటల గాలింపు ప్రక్రియలో 48 గంటల సమయం పూర్తయింది. రెండు తీరరక్షక దళ నౌకలు, మూడు నావికాదళ హెలికాప్టర్లు గాలింపు చర్యలు చేపడుతున్నాయి. తీరరక్షక దళ ప్రాంతీయ కార్యకలాపాల కేంద్రాన్ని ఐజీ గోపీనాథ్ జెట్టి పర్యవేక్షిస్తున్నారు. వాణిజ్య నౌక ద్వారా రక్షించిన చిన్నకు వైద్య సహాయం అందిస్తోంది. రక్షణ చర్యలకు సంబంధించిన తాజా సమాచారాన్ని ముఖ్యమంత్రి ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు. గల్లంతైన మత్స్యకారులను త్వరగా గుర్తించాలని ఆయన అధికారులను ఆదేశించారు. సముద్ర వాతావరణ పరిస్థితుల వల్ల సవాళ్లు ఎదురైనప్పటికీ, రాష్ట్ర, నౌకాదళ విభాగాల సమన్వయంతో మత్స్యకారులను రక్షించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి.

# సీసీ కెమెరాల ద్వారా వాయు కాలుష్యం అంచనా

**ఏఐతో గాలి నాణ్యతను పసిగట్టే సరికొత్త టెక్నాలజీ**

**డేటాను ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం**

**కాలుష్య అంచనాలో ఏఐ 90 శాతం ఖచ్చితత్వం**

**ప్రజలకు కాలుష్య సమాచారం అందేలా సిటీ యాప్ అందుబాటులోకి**



హైదరాబాద్‌లో వాయు కాలుష్యం రోజురోజుకూ తీవ్రమవుతోంది. అయితే కాలుష్యాన్ని కొలవడానికి ఖరీదైన ఎయిర్ క్వాలిటీ సెన్సార్లు వాడుతుంటారు. నగరంలో అడుగడుగునా ఉన్న సీసీ కెమెరాలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహాయంతో గాలి నాణ్యతను పసిగట్టే సరికొత్త టెక్నాలజీని హైదరాబాద్ ట్రిపుల్ ఐటీ పరిధిలోని స్మార్ట్ సిటీ లివింగ్ ల్యాబ్ అభివృద్ధి చేసింది. హైదరాబాద్‌లో గాలి నాణ్యత ఎలా ఉందో తెలుసుకోవాలంటే ఇప్పటి వరకు కాలుష్య నియంత్రణ మండలి ఏర్పాటు చేసే సెన్సార్ల మీదే ఆధారపడాల్సి వస్తోంది. వాటి నిర్వహణ ఎంతో వ్యయప్రయాసలతో కూడుకున్న పని. దీనికి చెక్ పెడుతూ ట్రిపుల్ ఐటీ హైదరాబాద్‌లోని స్మార్ట్ సిటీ లివింగ్ ల్యాబ్ నిపుణులు ఒక సరికొత్త విధానానికి శ్రీకారం చుట్టారు. నగరంలోని ట్రాఫిక్ సిగ్నల్స్‌తో పాటు, వివిధ ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ద్వారా వాయు కాలుష్యాన్ని అంచనా వేసే టెక్నాలజీని అభివృద్ధి చేశారు. దీని ద్వారా రోడ్డుపై ఎంత ట్రాఫిక్ ఉంది ఏయే వాహనాలు వెళ్తున్నాయి చెత్త తగలబెడుతున్నారా లాంటి పరిస్థితులను కెమెరాలో రికార్డు చేయడంతో కాలుష్య తీవ్రతను ఏఐ మోడల్స్ విశ్లేషించి ఇట్టే పసిగడతాయి. సీసీ కెమెరాల ద్వారా సేకరించిన ఈ డేటాను ఎడ్జ్ ప్రాసెసింగ్ ద్వారా ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేయడం వల్ల క్షణాల్లో కాలుష్య నివేదిక అధికారులకు చేరుతుంది. దీని ఆధారంగా ఏయే మార్గాల్లో కాలుష్యం ఎక్కువగా ఉందో గుర్తించే అవకాశం ఉంటోంది. దీని సాయంతో ట్రాఫిక్ దారి మళ్లించడం, స్కూళ్లు, ఆఫీసుల వేళల్లో మార్పులు చేయడం లాంటి విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడానికి అవకాశం ఏర్పడుతుంది. రెండేళ్ల క్రితం ప్రారంభమైన ఈ ప్రాజెక్టులో మొదట్లో 82 శాతం కచ్చితత్వం రాగా, ఆ తర్వాత మోడల్‌ను మరింత అభివృద్ధి చేశారు. దీంతో ప్రస్తుతం కాలుష్యాన్ని అంచనా వేయడంలో ఏఐ ఏకంగా 90 శాతం కచ్చితత్వాన్ని సాధిస్తోంది. "ట్రాఫిక్‌లో ఒక కారు, ఒక లారీ ఉంటే ఈ రెండు వాహనాల నుంచి ఎంత కాలుష్యం వస్తుంది. అలాగే ఒకచోట మంట పెట్టారు. అక్కడ నుంచి ఎంత కాలుష్యం వస్తుందని అంచనా వేయవచ్చు. ఇలా వేరు వేరు సందర్భాల్లో ఎంత కాలుష్యం వస్తుందనేది కెమెరా ద్వారా తెలుసుకోవచ్చు. కెమెరాలో ఉన్న ఫొటో డేటా ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్‌కు వెళ్తుంది. దాంతో ఎంత కాలుష్యం వస్తుందనేది తెలుస్తుంది. ఒక ప్రాంతం నుంచి ఎక్కువ కాలుష్యం వెలువడితే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయగలుగుతాం. దాంతో ప్రభుత్వం కూడా ఏవైనా నిర్ణయాలు తీసుకోవచ్చు" - వట్టెం అనురాధ, చీఫ్ టెక్నాలజీ ఆర్కిటెక్ట్, స్మార్ట్ సిటీ లివింగ్ ల్యాబ్. ఈ సరికొత్త టెక్నాలజీని ఇప్పటికే ల్యాబ్ ప్రతినిధులు సంగారెడ్డి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సిటీ ఆపరేటింగ్ ప్లాట్‌ఫామ్ ద్వారా డేటాను భద్రంగా ఉంచుతూనే ప్రజలకూ కాలుష్య సమాచారం అందేలా ప్రత్యేక సిటీ యాప్‌ను కూడా డెవలప్ చేస్తున్నారు. ఈ టెక్నాలజీ పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే సామాన్యులు కూడా తాము రోజూ వెళ్లే మార్గంలో గాలి స్వచ్ఛంగా ఉందో లేదో ముందుగానే తెలుసుకోవచ్చు. ఒకవేళ వాయు కాలుష్యం ఎక్కువగా ఉంటే వాకింగ్ చేసేవారు వేరే రోడ్డును ఎంచుకోవచ్చు. డేటా ప్రైవసీకి ఎలాంటి భంగం కలగకుండా అత్యంత పకడ్బందీ సెక్యూరిటీతో దీన్ని రూపొందిస్తున్నారు. భవిష్యత్‌లో ఈ మోడల్‌ను ప్రభుత్వ డేటా సెంటర్‌కు అనుసంధానించి, కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టేందుకు మార్గం సుగమం కానుంది. ప్రభుత్వం ఈ టెక్నాలజీని పూర్తి స్థాయిలో అందిపుచ్చుకుంటే హైదరాబాద్ లాంటి మహానగరాల్లో వాయు కాలుష్య నియంత్రణ మరింత సులభతరం కానుంది.

# పెళ్లైన 6 నెలలకే సౌదీకి - 44 ఏళ్లు ఎదురుచూసిన ఆ ఇల్లాలికి మిగిలింది మృతదేహమే

**పాస్‌పోర్టు, వీసాల గడువు ముగిసినా సౌదీలోనే చంద్రయ్య (65)**

**44 ఏళ్ల క్రితం వెళ్లి తిరిగి రాలేదు, ఫోన్ చేయలేదన్న భార్య లక్ష్మి**

**నెల రోజుల క్రితం ఆసుపత్రిలో చనిపోయిన చంద్రయ్య**



వారిద్దరు 1982లో పెద్దల సమక్షంలో పెళ్లి బంధంతో ఒక్కటయ్యారు. ఆరు నెలలు గడిచాక ఉపాధి కోసం భర్త గల్ఫ్ దేశం సౌదీకి వెళ్లాడు. 44 ఏళ్ల క్రితం వెళ్లి తిరిగి రాలేదు కదా, కనీసం ఫోన్ కూడా చేయలేదు. నెల రోజుల క్రితం అనారోగ్యంతో అక్కడే చనిపోయాడు. ఇప్పటికే పాస్‌పోర్టు, వీసాల గడువు ముగిసినా కూలీ పనులు చేసుకుంటూ అక్కడే ఉండిపోయాడు. ఇంటికి తిరిగి వెళ్లే దారిలేక సౌదీ అరేబియాలోనే జీవితం కొనసాగించాడు. కొద్ది రోజుల తర్వాత అతడిని దుబ్బాక మున్సిపాలిటీలోని చెల్లాపూర్ రెండో వార్డుకు చెందిన బొట్ల చంద్రయ్య (65)గా అధికారులు గుర్తించారు. మృతదేహాన్ని స్వదేశానికి పంపే ఏర్పాట్లను అధికారులు చేస్తున్నారు. బొట్ల చంద్రయ్యకు లక్ష్మితో 1982లో వివాహం జరిగింది. భార్య, వృద్ధులైన తల్లిండ్రులు కిష్టయ్య, బాలవ్వను స్వగ్రామంలోనే విడిచి ఉపాధి కోసం అతడు పెళ్లైన ఆర్నెళ్లకే సౌదీ అరేబియాకు వెళ్లాడు. అప్పటి నుంచి ఎప్పుడూ ఇంటికి రాలేదు. అతడి గురించి క్షేమ సమాచారం తెలియలేదు. కుటుంబ సభ్యులు ఎన్నిసార్లు ఆరా తీసినా ఆచూకీ, ఆనవాళ్లు కూడా లభించలేదు. వీసా గడువు ముగిసి – తిరిగి రాలేక : కొన్నేళ్లకు చంద్రయ్య తల్లిదండ్రులు చనిపోయారు. కోడలు లక్ష్మి దగ్గరుండి అంత్యక్రియలు చేశారు. 15 సంవత్సరాల క్రితమే చంద్రయ్య వీసా టైమ్ ముగిసింది. రెన్యూవల్ చేసుకోలేదు. నెల రోజుల క్రితం ఆసుపత్రిలో ప్రాణాలు విడిచాడు. పాత వీసా వివరాల ప్రకారం అతడి స్థానికతను అక్కడి అధికారులు గుర్తించి రాయబార కార్యాలయానికి సమాచారమిచ్చారు. ప్రవాసీ తెలుగు సంఘానికి చెందిన కార్యకర్త ఫారుఖ్ రెండు వారాలుగా కృషి చేసి, వివిధ సోషల్ మీడియాల ద్వారా చంద్రయ్య మరణ వార్తను ప్రసారం చేశారు. ఎట్టకేలకు చివరగా కుటుంబ వివరాలు తెలుసుకున్నారు. గత 44 ఏళ్లుగా భర్త కోసం ఎదురు చూసిన ఆ ఇల్లాలికి చివరికి కన్నీరే మిగిలింది. సౌదీ వెళ్లిన తన భర్త తనకు ఒక్కసారి కూడా ఫోన్ చేయలేదని, ఏనాడూ రూపాయి డబ్బు పంపలేదని భార్య లక్ష్మి తెలిపారు. తనను ఒంటరి మహిళగా గుర్తించిన ప్రభుత్వం పింఛన్ మాత్రం ఇస్తోందన్నారు. భర్త మృతదేహాన్ని ఎలాగైనా ఇక్కడికి తీసుకువచ్చే విధంగా ఏర్పాట్లు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆమె వేడుకుంటున్నారు.

# కాశీతోటలో విషాదం తనతోపాటు కుమారుడిపై పెట్రోలు పోసి నిప్పంటించుకున్న తల్లి

**కుమారుడిని ద్విచక్ర వాహనంపై తీసుకొని కాశీతోటలోని శివాలయం వద్దకు చేరుకున్న లీలాబాలశ్రావణి**

**నిర్మానుష్య ప్రాంతంలో తనతో పాటు కుమారుడిపై పెట్రోలు పోసి నిప్పంటించుకున్న శ్రావణి**



అప్పుడప్పుడే చీకటి పడుతోంది. అమ్మ స్కూటీ బయటకు తీసింది. గ్రామం దాటి వాహనం వెళుతుండగా చిమ్మ చీకటి. చల్లని గాలులకు శరీరం వణికింది. అది కొన్ని క్షణాల పాటే. తల్లి తీసుకొచ్చిన పెట్రోలు పోసి తనతో పాటు బిడ్డకు నిప్పు పెట్టడంతో పచ్చని తోటల్లో అగ్నికీలలు ఎగిశాయి. చలికి వణికిన శరీరం నిప్పుల కొలిమిలా మారింది. క్షణాల్లోనే తల్లి ప్రాణాలు అగ్నికి ఆహుతి కాగా ఏం జరుగుతుందో తెలియని ఆ బాలుడు ఒళ్లు కాలిపోతోంది కాపాడండీ అంటూ చీకట్లోనే పరుగులు పెట్టాడు. చివరికి ప్రాణాలు విడిచాడు. క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయంతో రెండు ప్రాణాలు కోల్పోయిన ఘటన తిరుపతి జిల్లా వెంకటగిరి మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వెంకటగిరి పట్టణంలోని ఆత్మామలిక్ ధ్యాన మందిరంలో నాగేశ్వరశర్మ పండితుడిగా పని చేస్తున్నారు. ఆయనకు భార్య లీలాబాలశ్రావణి (35), కుమారుడు చంద్రమౌళి (9), ఓ కుమార్తె (7) ఉన్నారు. లీలా బాలశ్రావణి సోమవారం సాయంత్రం కుమారుడిని ద్విచక్ర వాహనంపై తీసుకొని కాశీతోటలోని శివాలయం వద్దకు చేరుకున్నారు. నిర్మానుష్య ప్రాంతంలో తనతో పాటు కుమారుడిపై పెట్రోలు పోసి నిప్పంటించుకుంది. మంట వేడి తాళలేక చంద్రమౌళి కేకలు వేస్తూ తుప్పల్లో పరుగులు తీశాడు. సమీపంలోని ఆటో డ్రైవర్లు గమనించి ఆరా తీయగా తన తండ్రి సెల్‌ఫోన్ నంబరు ఇచ్చి సమాచారం తెలియజేయాలని కోరాడు. విషయం తెలుసుకున్న నాగేశ్వరశర్మ అక్కడి చేరుకున్నారు. భార్య చనిపోయి ఉండటంతో చేసేది లేక కుమారుడిని తీసుకొని తిరుపతి బయలుదేరాడు. సగం దూరం వెళ్లేసరికి బాలుడు సైతం ప్రాణాలు కోల్పోయాడు. వీరిద్దరూ బయటకు వచ్చిన సమయంలో కుమార్తె ఆడుకోవడానికి వెళ్లిపోవడంతో ప్రాణాలతో బయటపడిందని స్థానికులు చెబుతున్నారు. సమాచారం అందుకున్న సీఐ రోశయ్య, ఎస్సై స్వరూప అక్కడకి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఆత్మహత్య చేసుకోవడానికి గల పూర్తి కారణాలు తెలియాల్సి ఉంది.

# రూ.70 వేలు లంచం.. ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా చిక్కిన చేర్యాల తహసీల్దార్

**సిద్దిపేట జిల్లాలో లంచం తీసుకుంటూ పట్టుబడ్డ తహసీల్దార్**

**చేర్యాల తహసీల్దార్ దిలీప్ నాయక్‌ను అరెస్ట్ చేసిన ఏసీబీ అధికారులు**

**నాలా కన్వర్షన్ కోసం రూ.70,000 డిమాండ్ చేసినట్లు ఆరోపణ**



సిద్దిపేట జిల్లాలో ఒక ప్రభుత్వ అధికారి లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. చేర్యాల తహసీల్దార్‌గా విధి నిర్వహణలో ఉన్న కొర్రా దిలీప్ నాయక్, రూ.70,000 లంచం స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు సోమవారం అరెస్ట్ చేశారు. ఏసీబీ అధికారులు విడుదల చేసిన పత్రికా ప్రకటన ప్రకారం, నాగపురి గ్రామంలోని పలు సర్వే నంబర్లకు సంబంధించి 11 నాలా (వ్యవసాయేతర భూమి మార్పిడి) దరఖాస్తుల ప్రాసెసింగ్ కోసం ఫిర్యాదుదారుడి నుంచి తహసీల్దార్ ఈ లంచం డిమాండ్ చేశారు. జమున కనకమ్మ మరియు ఇతరుల పేర్లపై ఉన్న 30 గుంటల భూమికి సంబంధించిన పనుల నిమిత్తం ఆయన ఈ మొత్తాన్ని తీసుకున్నారు. సోమవారం మధ్యాహ్నం చేర్యాలలోని తన కార్యాలయంలోనే దిలీప్ నాయక్ లంచం తీసుకుంటుండగా, పక్కా ప్రణాళికతో ఏసీబీ అధికారులు ఆయనను పట్టుకున్నారు. నిందితుడి వద్ద నుంచి లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం దిలీప్ నాయక్‌ను అరెస్ట్ చేసి, హైదరాబాద్‌లోని ఏసీబీ కేసుల విచారణ ప్రత్యేక కోర్టులో హాజరుపరచనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఎవరైనా అధికారులు లంచం డిమాండ్ చేస్తే తమ టోల్-ఫ్రీ నెంబర్ 1064కు సమాచారం అందించాలని ఏసీబీ ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

# ‘పింక్ సాల్ట్’ ఆరోగ్యానికి మంచిదేనా

### నిపుణులు ఏమంటున్నారంటే!
### మీరు ఉప్పు వాడకం తగ్గించాలని అనుకుంటున్నారా
### ఈ పింక్ సాల్ట్ వాడితే అనేక ఆరోగ్య ప్రయోజనాలట!

‘ఉప్పు ఎంత తగ్గిస్తే అంత మంచిది, ఆరోగ్య సమస్యలు తగ్గుతాయి’ అని డాక్టర్లు, పోషక నిపుణులు పదే పదే చెబుతుంటారు. అందుకే, సాల్ట్ తగ్గించుకుని తినడంతో పాటు, తక్కువ హాని కలిగించే వాటిని వెతికి మరీ కొంటున్నారు చాలా మంది. ఇందులో భాగంగా ఈ మధ్య మార్కెట్లో ఎక్కువగా కనిపిస్తున్నదే ‘ హిమాలయన్ పింక్ సాల్ట్’. ఈ ఉప్పును వాడడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో పింక్ సాల్ట్ వల్ల కలిగే హెల్త్ బెనిఫిట్స్ గురించి ఇప్పుడు తెలుసుకుందాం!

హిమాలయన్ పింక్ సాల్ట్‌ను మార్కెట్‌లో రాక్‌సాల్ట్‌గా, పింక్ సాల్ట్‌గా, లైట్ సాల్ట్‌గా లేదా తక్కువ సోడియం సాల్ట్‌గా అమ్ముతుంటారు. ఇది ఆరోగ్యానికి మంచిదని ఆయుర్వేదంలోనూ, సాధారణంగానూ భావిస్తుంటారు. అయితే నార్మల్ ఉప్పుతో పోలిస్తే రాక్ సాల్ట్ అనేది తక్కువ ప్రాసెస్ చేస్తారని నిపుణులు పేర్కొన్నారు. ఇందులో ఖనిజాలు సమృద్ధిగా ఉంటాయని, ఇవి శరీరం నుంచి విషాన్ని బయటకు పంపి ప్రేగులను శుభ్రపరచడంతో పాటు గట్ హెల్త్‌ను మెరుగుపరుస్తుందని నిపుణులు చెబుతున్నారు.

**ఖనిజాలు అధికంగా ఉండటం :** పింక్ సాల్ట్‌లో శరీరానికి అవసరమైన ట్రేస్ మినరల్స్‌తో పాటు కాల్షియం, మెగ్నీషియం, ఐరన్?, జింక్ వంటి ఖనిజాలు ఉంటాయని అధ్యయనంలో పేర్కొంది. ఈ ఖనిజాలు నరాల పనితీరు, కండరాల సంకోచాలు, శరీర ద్రవ సమతుల్యత వంటి ముఖ్యమైన శరీర విధులకు మద్దతు ఇస్తాయంటున్నారు.

**జీర్ణక్రియకు సహాయం :** ఆయుర్వేదం ప్రకారం, రాక్ సాల్ట్ జీర్ణక్రియను మెరుగుపరచడం, కడుపు ఉబ్బరం, అసిడిటీ, మలబద్ధకం వంటి ఉదర సంబంధిత సమస్యలను తగ్గించడంలో ఉపయోగపడుతుందని అంటున్నారు. ఇది జీర్ణ ఎంజైమ్?ల ఉత్పత్తిని ప్రేరేపించడంలో సహాయపడుతుందని పేర్కొన్నారు.

**ఎలక్ట్రోలైట్, హైడ్రేషన్ :** సాధారణ ఉప్పు శరీరాన్ని డీ హైడ్రేట్ చేస్తుందని, అదే పింక్ సాల్ట్ అయితే బాడీని తేమగా ఉంచుతూ ఎలక్ట్రోలైట్ల స్థాయిలను బ్యాలెన్స్ చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. పింక్ సాల్ట్ నీటి మిశ్రమాన్ని (సోలో వాటర్) తాగినప్పుడు కండరాల తిమ్మిరి తగ్గుతుందని అధ్యయనంలో పేర్కొంది.




**తక్కువ సోడియం కంటెంట్ :** సాధారణ ఉప్పుతో పోలిస్తే పింక్ సాల్ట్‌లో సోడియం స్థాయిలు తక్కువగా ఉంటాయంటున్నారు నిపుణులు. దీని వల్ల వంటలో ఒకే పరిమాణాన్ని కొలిచి వాడినప్పుడు, సాధారణ ఉప్పు కంటే తక్కువ సోడియం తీసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. అందుకే, బీపీతో బాధపడుతున్న వారు, తక్కువ సోడియం తీసుకోవాలనుకునే వారికి ఇది మంచిదని సూచిస్తున్నారు.రాక్ సాల్ట్‌లో ఖనిజాలు ఉన్నప్పటికీ, అవి చాలా తక్కువ పరిమాణంలో ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. కేవలం ఉప్పు ద్వారానే ఆ ఖనిజాల అవసరాలను తీర్చుకోవడానికి ప్రయత్నించడం మంచిది కాదని సూచిస్తున్నారు. ముఖ్యంగా రాక్ సాల్ట్‌ను వాడుతున్నట్లయితే, సాధారణ ఉప్పు ద్వారా లభించే అయోడిన్‌ను ఇతర ఆహార వనరుల నుంచి తప్పనిసరిగా తీసుకోవాలని సూచిస్తున్నారు. ఈ క్రమంలో ఉప్పు ఏదైనా సరే, ఆరోగ్యకరమైన జీవితం కోసం మితంగానే వాడటం చాలా ముఖ్యమంటున్నారు నిపుణులు. రక్తపోటు లేదా ఇతర ఆరోగ్య సమస్యలు ఉంటే, ఆహారంలో ఉప్పు మార్పుల గురించి వైద్యుల సలహా తీసుకోవడం మేలని సలహా ఇస్తున్నారు.

## ఈ ఆకులు చిన్నగా ఉన్నా.. చేసే మేలు ఎంతో తెలుసా..? ఒకసారి మీరు తిని చూడండి..!



మనం తినే ఆహారంలో సరైన మార్పులు చేసుకుంటే ఆరోగ్యం బాగు చేసుకోవడం పెద్ద కష్టం కాదు. అలాంటి మార్గాల్లో మెంతి ఆకులు ఒకటి. ఇవి పూర్తిగా సహజంగా దొరుకుతాయి. మన శరీరానికి కావాల్సిన పోషకాలను ఇవి అందిస్తాయి. అది ఎలాగో ఇప్పుడు తెలుసుకుందాం. మన పెద్దలు.. ముఖ్యంగా పల్లెల్లో ఉండేవాళ్ళు మెంతి ఆకుల గొప్పదనాన్ని చాలా ముందుగానే గుర్తించారు. అయితే ఈ రోజుల్లో నగరాల్లో ఉంటున్న వాళ్ళు ఆరోగ్యకరమైన ఆహారం కావాలని అనుకుంటున్నా.. ఈ చిన్న ఆకుల్లో ఉన్న ఆరోగ్య రహస్యాలను మర్చిపోతున్నారు.మెంతి ఆకులను పరోటాలు, కూరలు, పచ్చడి లాంటి వాటిలో వాడడం ద్వారా మనం వాటిని సులభంగా మన ఆహారంలో చేర్చుకోవచ్చు. ఈ ఆకుల్లో జీర్ణక్రియకు సహాయపడే గుణాలు పుష్కలంగా ఉన్నాయి. ఫైబర్, ప్రొటీన్లు ఎక్కువగా ఉండడం వల్ల శరీరంలో కొవ్వు పేరుకుపోకుండా జీర్ణక్రియలు సరిగా జరిగేలా చేస్తాయి. మధుమేహం ఉన్నవారికి మెంతి ఆకులు చాలా మంచి చేస్తాయి. వీటిలో ఉండే సహజ పదార్థాలు రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంలో సహాయపడతాయి. ఇన్సులిన్ ఉత్పత్తిని పెంచి షుగర్ స్థాయిలను సమతుల్యం చేస్తాయి. ఇవి శరీరంలోని అనవసరపు కొవ్వును తగ్గించడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయి. చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించి మంచి కొలెస్ట్రాల్ ను పెంచడానికి తోడ్పడతాయి. దీని వల్ల గుండె సమస్యల నుంచి దూరంగా ఉండడానికి అవకాశం ఉంటుంది.మెంతులు ఆడవాళ్లకు ఎంతో మేలు చేస్తాయి. బిడ్డ పుట్టాక తల్లి పాలు ఎక్కువ రావడానికి ఇవి సహాయపడుతాయి. అలాగే అరుగుదల సమస్యలు, మలబద్ధకం, గ్యాస్ లాంటి సమస్యలను తగ్గించడంలో ఇది సహజమైన మందులా పనిచేస్తుంది. మగవాళ్ళ విషయంలో చూస్తే మెంతులు శరీర శక్తిని పెంచడంలో.. సహజ హార్మోన్ల సమతుల్యతను మెరుగుపరచడంలో తోడ్పడతాయి.శరీరం దృఢంగా మారడానికి కూడా ఇవి సహాయపడతాయి. మెంతులు రోజువారీ ఆహారంలో భాగంగా తీసుకుంటే గుండె జబ్బుల నుంచి రక్షణ లభిస్తుంది. సరైన మోతాదులో రోజూ మెంతులను తీసుకోవడం వల్ల శరీరం ఆరోగ్యాన్ని పూర్తిగా బాగు చేసుకోవచ్చు. మెంతి ఆకులను వాడడం ద్వారా మనం మన ఆరోగ్య ప్రయాణంలో సహజ మార్గాన్ని ఎంచుకున్నట్లే.

## వామ్మో..ఇంత చేదు మాకొద్దని పారిపోతున్నారా..? కాకరకాయ లాభాలు తెలిస్తే..



కూరగాయలన్నింటిలో కాకరకాయ అంటే చాలా మంది దూరం పెడుతుంటారు. అంత చేదు మాకొద్దు బాబోయ్ అంటూ పారిపోతుంటారు. కానీ, ఇందులోని చేదు ఆరోగ్యానికి ఎంత మంచిదో తెలిస్తే మాత్రం ఇకపై తినకుండా ఉండలేరు. ఈ చేదు కూరగాయలో అనేక పోషకాలు నిండివున్నాయి. కాకరకాయలోని గుణాలు అనేక ఆరోగ్య సమస్యలను నివారించడంలో సహాయపడుతాయని నిపుణులు చెబుతున్నారు. చేదు కాకరకాయ తినటం వల్ల కలిగే కొన్ని ముఖ్యమైన ఆరోగ్య ప్రయోజనాలు ఇక్కడ తెలుసుకుందాం.షుగర్ కంట్రోల్ అవ్వాలనుకునే డయాబెటిస్ బాధితులకు కాకరకాయ వరం లాంటిది అంటున్నార ఆరోగ్య నిపుణులు. కాకరకాయలోని గుణాలు రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంలో సహాయపడతాయి. డయాబెటిస్ ఉన్నవారికి ఇది చాలా ఉపయోగకరంగా ఉంటుంది. అంతేకాదు..కాకరకాయలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. మలబద్ధకాన్ని నివారిస్తుంది.కాకరకాయ కూరతో పాటుగా జ్యూస్‌లా కూడా తీసుకోవచ్చు అంటున్నారు నిపుణులు. ఇందులో కేలరీలు తక్కువగా ఉండి, ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. దాంతో కాకరకాయ జ్యూస్ తీసుకోవటం వల్ల త్వరగా కడుపు నిండిన అనుభూతిని కలిగిస్తుంది. ఎక్కువ ఆహారం తీసుకోకుండా చేస్తుంది. తద్వారా బరువు తగ్గడానికి దోహదం చేస్తుంది.కాకరకాయలో విటమిన్ సి యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచడానికి శరీరాన్ని ఇన్ఫెక్షన్ల నుండి రక్షించడానికి సహాయపడతాయి. అలాగే, కాకరకాయ జ్యూస్‌లోని విటమిన్ ఎ, సి వంటి యాంటీఆక్సిడెంట్లు చర్మాన్ని ఫ్రీ రాడికల్స్ నుంచి రక్షిస్తాయి. మొటిమలను తగ్గించడంలో చర్మం ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి. తరచూ కాకరకాయ జ్యూస్ తీసుకోవటం వల్ల కాలేయాన్ని శుభ్రపరచడానికి, కాలేయ పనితీరును మెరుగుప రచడానికి సహాయపడుతుంది. ఇది శరీరంలోని విష వ్యర్థాలను తొలగించడంలో కూడా సహాయపడుతుంది. శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గించడంలో సహాయపడుతుంది. కాకరకాయలో క్యాన్సర్ కణాల పెరుగుదలను నిరోధించే సమ్మేళనాలు ఉన్నాయి. ఇది ముఖ్యంగా రొమ్ము, ప్రోస్టేట్ పెద్దప్రేగు కాన్సర్ల నివారణలో సహాయపడుతుంది. కాకరకాయలో విటమిన్ ఎ కూడా అధికంగా ఉంటుంది. ఇది కంటి చూపును మెరుగు పరచడానికి కంటి సమస్యలను నివారించడానికి తోడ్పడుతుంది. ఎముకల ఆరోగ్యానికి సహాయపడుతుంది. దంతాలను బలంగా ఉంచుతుంది.

### చాక్లెట్ తినడం వల్ల ఎన్ని లాభాలో తెలిస్తే..
## ఎగిరి గంతేస్తారు..!



అయితే, మనం తినే సాధారణ చాక్లెట్స్ కంటే కూడా డార్క్ చాక్లెట్స్ చాలా మంచిదని నిపుణులు చెబుతున్నారు. ఈ డార్క్ చాక్లెట్లలో చక్కెర తక్కువగా ఉంటుంది. డార్క్ చాక్లెట్ తినటం వల్ల ఆరోగ్యానికి మేలు జరుగుతుందని పలు పరిశోధనలు కూడా వెల్లడించాయి. ఎప్పుడూ ఏదో ఒక చిరుతిండి తినాలని ఉన్న ఒక చిన్న చాక్లెట్ నోట్లో వేసుకోండి. ఇక అలాంటి పదార్థాల పైకి మనసు మళ్లదు. తద్వారా అధిక బరువు పెరగకుండా ఉంటారు. చాక్లెట్ అంటే ఇష్టపడని వారుండరు. చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ చాక్లెట్ తినేందుకు ఇష్టపడతారు. ముఖ్యంగా అమ్మాయిలైతే చెవి కోసుకుంటారు. చాక్లెట్స్‌లో చాలా రకాలు ఉన్నాయి. ఎన్నో బ్రాండ్స్ చాక్లెట్‌లు మార్కెట్లో అమ్ముతుంటారు. అయితే, చాక్లెట్ తినడం వల్ల నోటికి రుచి మాత్రమే కాదు.. ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కూడా ఉన్నాయంటున్నారు నిపుణులు. మానసిక ఒత్తిడిని తగ్గించే అద్భుత గుణాలు చాక్లెట్‌లో ఉన్నాయని చెబుతున్నారు. మన మెదడులో సెరటోనిన్ హార్మోన్ స్థాయులను పెంచి ఆందోళనలను తగ్గిస్తుంది. మనసుకు ప్రశాంతాన్నిస్తుంది.

చాక్లెట్‌లో ‘ఎల్-ఆర్జినైన్’ అనే అమైనో ఆమ్లం ఉంటుంది. చాక్లెట్‌లోని ఫ్లేవనాయిడ్స్ అతినీలలోహిత కిరణాల నుంచి చర్మాన్ని రక్షిస్తాయి. అలాగే చర్మానికి రక్తప్రసరణను మెరుగుపరిచి చర్మ ఆరోగ్యానికి దోహదం చేస్తాయి. గర్భిణిగా ఉన్నప్పుడు రోజూ 30 గ్రాముల చాక్లెట్ తీసుకోవడం వల్ల పిండం ఆరోగ్యంగా ఎదుగుతుందని నిపుణులు చెబుతున్నారు. అందుకే గర్భిణులు చాక్లెట్ తినాలని నిపుణులు చెబుతున్నారు. అయితే, మనం తినే సాధారణ చాక్లెట్స్ కంటే కూడా డార్క్ చాక్లెట్స్ చాలా మంచిదని నిపుణులు చెబుతున్నారు. ఈ డార్క్ చాక్లెట్లలో చక్కెర తక్కువగా ఉంటుంది. డార్క్ చాక్లెట్ తినటం వల్ల ఆరోగ్యానికి మేలు జరుగుతుందని పలు పరిశోధనలు కూడా వెల్లడించాయి. ఎప్పుడూ ఏదో ఒక చిరుతిండి తినాలని ఉన్న ఒక చిన్న చాక్లెట్ నోట్లో వేసుకోండి. ఇక అలాంటి పదార్థాల పైకి మనసు మళ్లదు. తద్వారా అధిక బరువు పెరగకుండా ఉంటారు.

### వామ్మో.. సడెన్‌గా మందులు మానేస్తున్నారా..?
## ఎంత డేంజరో తెలుసా..



మారుతున్న జీవనశైలి కారణంగా, అధిక రక్తపోటు గురించి ఫిర్యాదులు ప్రజలలో సర్వసాధారణంగా మారుతున్నాయి. అటువంటి పరిస్థితిలో, వైద్యులు నిరంతరం మందులు తీసుకోవాలని సిఫార్సు చేస్తారు. కానీ చాలా సార్లు ప్రజలు వైద్యుడిని సంప్రదించకుండా మందులు తీసుకోవడం మానేస్తారు.. ఇది చాలా ప్రమాదకరమంటున్నారు వైద్యనిపుణులు.. ఒకప్పుడు వృద్ధాప్యంలో వచ్చే అధిక రక్తపోటు సమస్య ఇప్పుడు యువకులు, మధ్య వయస్కులలో కూడా కనిపిస్తోంది. అటువంటి పరిస్థితిలో, బిపిని నియంత్రణలో ఉంచడానికి వైద్యులు నిరంతరం మందులు తీసుకోవాలని సిఫార్సు చేస్తున్నారు. ఈ మందులను నిరంతరం తీసుకోవడం చాలా ముఖ్యం. కానీ చాలా సార్లు రోగులు వైద్యుడిని సంప్రదించకుండా మందులు తీసుకోవడం మానేస్తారు.. ఇది అనేక సమస్యలకు దారితీస్తుంది. అటువంటి పరిస్థితిలో, గుండె, మెదడు, మూత్రపిండాలు, కళ్ళు తీవ్రంగా ప్రభావితమవుతాయి. దీని వల్ల ఎలాంటి నష్టం జరుగుతుంది.. వైద్య నిపుణులు ఏం చెబుతున్నారు..? ఈ వివరాలను ఈ కథనంలో తెలుసుకోండి.. అధిక రక్తపోటు కారణంగా, రక్త నాళాలలో ఒత్తిడి చాలా ఎక్కువగా ఉంటుంది. అందువల్ల, మీరు అధిక రక్తపోటుకు మందు తీసుకోవడం ఆపివేస్తే, అది గుండె, మెదడు, మూత్రపిండాలపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతుంది.. నిరంతర అధిక రక్తపోటు కారణంగా అవి దెబ్బతింటాయి. ఇది జీవితాంతం సమస్యలకు కారణం కావచ్చు. అకస్మాత్తుగా మందులు ఆపివేసిన తర్వాత, రోగికి తలనొప్పి, తలతిరగడం, భయము, ఛాతీ నొప్పి, వేగవంతమైన హృదయ స్పందన, కాళ్ళలో వాపు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉండవచ్చు.. ఇలాంటి పరిస్థితుల్లో పరిస్థితి మరింత దిగజారిపోయే అవకాశం ఉంది. రోగిని వెంటనే ఆసుపత్రిలో చేర్చాల్సి రావచ్చు..

### మెదడు రక్తస్రావం లేదా పక్షవాతం వచ్చే ప్రమాదం

ఢిల్లీలోని ఆర్ఎంఎల్ హాస్పిటల్‌లోని మెడిసిన్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ సుభాష్ గిరి మాట్లాడుతూ.. అధిక రక్తపోటు మందులను ఆపడం ద్వారా మెదడు రక్తస్రావం లేదా పక్షవాతం వచ్చే ప్రమాదం గణనీయంగా పెరుగుతుందని చెప్పారు. కొన్నిసార్లు రోగి అకస్మాత్తుగా మూర్ఛపోవడం, శరీరంలోని ఏదో ఒక భాగంలో బలహీనత లేదా మాట్లాడటంలో ఇబ్బంది గురించి ఫిర్యాదు చేయడం ప్రారంభిస్తాడు. అధిక రక్తపోటు మందులను అకస్మాత్తుగా ఆపడం వల్ల గుండెపై ఒత్తిడి పెరుగుతుంది.. ఇది గుండెపోటు ప్రమాదాన్ని పెంచుతుంది. కిడ్నీ వైఫల్యం కూడా సంభవించవచ్చు. అకస్మాత్తుగా మందులను ఆపడం వల్ల రక్తపోటును నియంత్రించడం కష్టమవుతుంది.. మందుల ప్రభావం కూడా తగ్గుతుంది.

### ప్రజలు మందులను ఎందుకు మానేస్తారు..

చాలా సార్లు రోగులు తమ రక్తపోటు ఇప్పుడు సాధారణమైందని భావిస్తారని, కాబట్టి వారికి మందులు అవసరం లేదని సొంతంగా నిర్ణయం తీసుకుంటారని డాక్టర్ సుభాష్ వివరించారు. కొంతమంది మందుల దుష్ప్రభావాలకు భయపడి మందులు తీసుకోవడం మానేస్తారు. కొంతమంది మతిమరుపు లేదా నిర్లక్ష్యం కారణంగా అధిక బిపి మందులు తీసుకోవడం మానేస్తారు. కొన్ని సందర్భాల్లో, ప్రజలు ఇంటి లేదా ఇతర పద్ధతులపై ఆధారపడటం ద్వారా మందులు తీసుకోవడం మానేస్తారు. చాలా సార్లు ప్రజలు సోషల్ మీడియా లేదా వారి పరిచయస్తుల నుండి సమాచారాన్ని సేకరించడం ద్వారా మందులను ఆపాలని లేదా మోతాదును తగ్గించాలని నిర్ణయించుకుంటారని.. పేర్కొన్నారు.

### వైద్యుడిని సంప్రదించండి

అధిక రక్తపోటు ఉన్న రోగులు ఎప్పుడూ స్వయంగా మందులు తీసుకోవడం ఆపకూడదు. మందులు ఆపాలనే నిర్ణయం ఎల్లప్పుడూ వైద్యుడి సలహా మేరకే తీసుకోవాలి. మందుల దుష్ప్రభావాల గురించి వైద్యుడితో మాట్లాడండి. ఏదైనా ఔషధం దుష్ప్రభావాలను కలిగి ఉంటే, ఆ మందును తీసుకోవడం ఆపండి లేదా వైద్యుడి సలహా మేరకే మోతాదును తగ్గించండి. బరువు తగ్గడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, యోగా చేయడం, ఆహారపు అలవాట్లను నియంత్రించడం వంటి మార్పులు ఉంటే, మందులను ఆపవచ్చు లేదా తగ్గించవచ్చు.. కానీ ఈ పనులు కూడా వైద్యుడి పర్యవేక్షణలో చేయాలి.. కావున.. సైలెంట్ కిల్లర్ హైపర్‌టెన్షన్ (అధిక రక్తపోటు) గురించి బాధపడుతుంటే వెంటనే వైద్య నిపుణులను సంప్రదించండి..

## ఆకులతో ఆరోగ్యం!



ఆయుర్వేదంలో ‘నేరేడు’ది ప్రత్యేక స్థానం. దీని పండ్లు మాత్రమే కాదు.. ఆకులు కూడా ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కలిగిస్తాయని ఆయుర్వేద నిపుణులు అంటున్నారు. అనేక ఔషధ గుణాలతో నిండిన నేరేడు ఆకులు.. వివిధ వ్యాధులను నివారించడంలో సమర్థంగా పనిచేస్తాయని చెబుతున్నారు. నేరేడు ఆకులను నమలడం వల్ల నోటి ఆరోగ్యం మెరుగుపడుతుంది. నోట్లో ఉండే బ్యాక్టీరియా నశిస్తుంది. నోటి దుర్వాసన తగ్గుతుంది. దంతాలు, చిగుళ్లు ఆరోగ్యంగా మారుతాయి. వీటిలోని ఆయుర్వేద సమ్మేళనాలు.. జీర్ణవ్యవస్థ ఆరోగ్యానికి భరోసా ఇస్తాయి. నేరేడు ఆకుల కషాయం తాగితే.. విరేచనాలు ఇట్టే తగ్గిపోతాయి. కాలేయం పనితీరు కూడా మెరుగుపడుతుంది. కడుపు ఉబ్బరం, గ్యాస్, అజీర్తి వంటి సమస్యలూ తగ్గిపోతాయి. నేరేడు ఆకుల్లో యాంటి బ్యాక్టీరియల్, యాంటి ఇన్‌ఫ్లమేటరీ గుణాలు పుష్కలం. ఇవి రక్తంలో చక్కెర విడుదలను నియంత్రిస్తాయి. దాంతో, షుగర్ లెవల్స్ తగ్గుతాయి. అలా.. మధుమేహాన్ని నియంత్రణలో ఉంచుతాయి. భోజనానికి ముందు.. ఓ టీస్పూన్ నేరేడు ఆకుల రసాన్ని తీసుకుంటే మంచి ఫలితం కనిపిస్తుంది. నేరేడు ఆకుల రసంలో కొద్దిగా ధనియాలు వేసి తాగితే.. జ్వరం తగ్గిపోతుంది.

వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు
RNI TGTEL/25/A5065



# ప్రపంచం మారుతోంది- భారత్‌కు ఇదే సువర్ణావకాశం

**ఆనంద్ మహీంద్రా కీలక వ్యాఖ్యలు**

**దిగ్గజ పారిశ్రామిక వేత్త ఆనంద్ మహీంద్రా కీలక వ్యాఖ్యలు**

**కనెక్టర్ ఎకానమీగా ఎదిగేందుకు భారత్‌కు ఇదే గొప్ప అవకాశం అని వ్యాఖ్యలు**

**ప్రజాస్వామ్యం, రాజకీయ స్థిరత్వమే భారత్ బలమని స్పష్టం**



వేగంగా మారుతున్న ప్రపంచ భౌగోళిక, ఆర్థిక పరిస్థితుల మధ్య భారత్‌కు సువర్ణావకాశం ఉందని మహీంద్రా గ్రూప్ ఛైర్మన్, దిగ్గజ పారిశ్రామిక వేత్త ఆనంద్ మహీంద్రా అన్నారు. ప్రపంచం వేర్వేరు శక్తి కూటములుగా విడిపోతున్న ఈ సమయంలో అన్ని దేశాల్ని అనుసంధానించే 'కనెక్టర్ ఎకానమీ' గా భారత్ ఎదగగలదని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రపంచ దేశాల మధ్య వారధిగా భారత్ ఎదిగేందుకు మంచి అవకాశం ఉందని అన్నారు. మహీంద్రా అండ్ మహీంద్రా (వీడవీ) వార్షిక నివేదికలో వాటాదారులనుద్దేశించి మహీంద్రా ఈ వ్యాఖ్యలు చేశారు. ఒకప్పుడు అంతర్జాతీయంగా వచ్చిన మార్పుల్ని తాత్కాలిక అవరోధాలుగానే భావించేవారమని, కానీ ప్రస్తుత పరిస్థితుల్ని గమనిస్తే గ్లోబల్ సప్లై చైన్స్ (సరఫరా గొలుసు), భౌగోళిక రాజకీయ సమీకరణాలు, సరికొత్త సాంకేతికతల్లో దీర్ఘకాలిక మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయని ఆయన విశ్లేషించారు. ఇవి ఇప్పుడు శాశ్వత సమస్యలుగా పరిణమిస్తున్నాయని పేర్కొన్నారు.గతేడాది ప్రపంచ పరిస్థితుల్ని 'సముద్ర మంథన్' తో (సముద్ర మథనం) పోల్చిన ఆనంద్ మహీంద్రా- ఇప్పుడు ప్రపంచం మంథన్ 2.ా దశలోకి (రెండో విడత మథనం) ప్రవేశించిందన్నారు. ఇప్పుడు ముఖ్యంగా పశ్చిమాసియాలో ఇటీవల జరిగిన పరిణామాలు చూస్తే ప్రపంచ అనిశ్చితి ఇంకా కొనసాగుతోందని తెలిపారు. దీంతో 'మనం మొదటి విడత మథనాన్ని విజయవంతంగా దాటాం. ఇప్పుడు మనం మథనం 2.ా. ఎదుర్కొనేందుకు సిద్ధం కావాలి. గతంలో అనిశ్చితి ఒక తాత్కాలికం అయితే ఇప్పుడు అదే నిరంతర ప్రక్రియగా మారుతోంది. ఊహించని విపత్కర పరిస్థితులు ఇప్పుడు సర్వసాధారణం అయ్యాయి' అని ఆయన పేర్కొన్నారు. గతంలో ట్రంప్ సుంకాలు విధించిన సమయంలో సుంకాల మథనంలో భారత్‌కు అమృతం దక్కుతుందా అన్నట్లుగా వ్యాఖ్యానించారు.ప్రపంచవ్యాప్తంగా పరిస్థితులు నిరంతరం మారుతున్నందున భవిష్యత్తును అంచనా వేయడం మరింత క్లిష్టంగా మారిందని మహీంద్రా చెప్పారు. అందుకే సంస్థలు వేగంగా పరిస్థితులకు అనుగుణంగా మారే సామర్థ్యాన్ని, ప్రతికూల పరిస్థితుల్ని తట్టుకునే శక్తిని పెంచుకోవాలని సూచించారు. 'ఇప్పుడు పరిస్థితి ఒక్కోసారి షాక్‌లు రావడం కాదు. వరుస భూకంపాల్లా నిరంతరం మార్పులు జరుగుతున్నాయి. అందుకే చురుకుదనం, స్థిరత్వం అత్యంత కీలకం' అని అన్నారు.ప్రపంచం ఇలా విభజనల దిశగా సాగుతున్న వేళ, ఉద్రిక్తతలు తలెత్తుతున్న వేళ దేశాల మధ్య వారధిగా నిలిచే దేశాలే భవిష్యత్తు ప్రపంచ వ్యవస్థను నిర్మిస్తాయని మహీంద్రా అభిప్రాయపడ్డారు. ఈ క్రమంలోనే 'విభజనలతో కూడిన ప్రపంచంలో అందరినీ కలిపే కనెక్టర్ ఎకానమీగా భారత్ ఎదిగే అవకాశం ఉంది. గత కొంత కాలంగా భారత్ అనుసరిస్తున్న అందరితో సత్సంబంధాలు కొనసాగించే విదేశాంగ విధానం ప్రపంచవ్యాప్తంగా విశ్వాసాన్ని పెంచుతోంది' అని పేర్కొన్నారు. ఈ క్రమంలో భారత్‌కు ఉన్న ప్రధాన బలాల గురించి ఆయన వివరించారు. బలమైన ప్రజాస్వామ్యం, రాజకీయంగా స్థిరత్వం, భారీ దేశీయ మార్కెట్, పొరుగున ఉన్న చైనాకు ప్రత్యామ్నాయంగా మనకు వ్యూహాత్మక భౌగోళిక స్థానం, ప్రపంచ దేశాల్లో విశ్వాసాన్ని సంపాదించడం వంటి అంశాలన్నీ భారత్‌ను ప్రపంచానికి ఆదర్శవంతమైన కనెక్టర్ ఎకానమీగా మారుస్తాయని ఆయన అన్నారు.ప్రపంచానికి ఒకప్పుడు నాన్ అలైన్డ్ ఉద్యమాన్ని (అలీన విధానం) పరిచయం చేసిన దేశం భారత్ అని గుర్తు చేసిన మహీంద్రా- ఇప్పుడు అదే భారత్ మల్టీ అలైన్డ్ శక్తిగా మారాల్సిన సమయం వచ్చిందన్నారు. ఒక్క కూటమికే పరిమితం కాకుండా వివిధ దేశాలతో సమతుల్య సంబంధాలు కొనసాగిస్తూ విశ్వసనీయ భాగస్వామిగా ఎదగాలని సూచించారు. ఈ సందర్భంగా 'భారత్ ఎదుగుతుందా లేదా అనే ప్రశ్న ఇప్పుడు లేదు. ఈ అవకాశాన్ని ఎంత సమర్థంగా ఉపయోగించుకొని దీర్ఘకాలిక ప్రయోజనంగా మార్చుకుంటుందన్నదే అసలు ప్రశ్న అని మహీంద్రా వ్యాఖ్యానించారు.చివరగా ఈ కొత్త పరిస్థితుల్ని అవకాశంగా మలుచుకునేందుకు మహీంద్రా గ్రూప్ సిద్ధంగా ఉందని ఆనంద్ మహీంద్రా వెల్లడించారు. ఫార్ములా ఈ- రేసింగ్‌లో ఉపయోగించే అటాక్ మోడ్ వ్యూహాన్ని ఉదాహరణగా చెబుతూ 'అందరూ ఒకే వేగంతో ప్రయాణిస్తున్నప్పుడు ముందుకెళ్లడం కష్టం. కానీ వర్షం, పొగమంచు వంటి క్లిష్ట పరిస్థితుల్లో సరైన సమయంలో వేగాన్ని పెంచితే విజయాన్ని సాధించవచ్చు. ఇది తొందరపాటు నిర్ణయం కాదు. ముందస్తు ప్రణాళిక, ధైర్యం, సంసిద్ధతతో కూడిన వ్యూహాత్మక వేగం' అని మహీంద్రా పేర్కొన్నారు. అంటే ఇక్కడ భయపడి పెట్టుబడులు ఆపకుండా, మరింత ధీమాతో ఆవిష్కరణలు చేస్తూ ముందుకు సాగుతామని అన్నారు.

# టెక్ రంగాన్ని వణికిస్తున్న లేఆఫ్స్

**ఈ ఏడాది మొదటి ఆరు నెలల్లోనే 1.19 లక్షల మంది ఇంటికి!**

**2026 మొదటి అర్ధభాగంలో భారీ కోతలు**

**1.19 లక్షల మందికి పైగా ఉద్యోగాలు ఇంటికి**

**గతేడాది కంటే భారీగా పెరిగిన లే ఆఫ్స్**

**వ్యయ నియంత్రణ చర్యలు తీసుకుంటున్న కంపెనీలు**




ప్రపంచవ్యాప్తంగా టెక్ రంగంలో ఉద్యోగాల కోత (లేఆఫ్స్) పర్వం ఏమాత్రం తగ్గడం లేదు. తమ వ్యయ నియంత్రణ చర్యల్లో భాగంగా టెక్ కంపెనీలు ఉద్యోగులను తొలగించడాన్ని తీవ్రం చేశాయి. తాజా గణాంకాల ప్రకారం.. 2026 సంవత్సరపు మొదటి ఆరు నెలల కాలంలోనే (జనవరి నుండి జూన్ వరకు) వివిధ టెక్ కంపెనీలలో దాదాపు 1,19,000 మందికి పైగా ఉద్యోగాలు కోల్పోయారు. ఈ లేఆఫ్స్ పర్వం ఐటీ పరిశ్రమలో పనిచేస్తున్న ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళనను రేకెత్తిస్తోంది.గత కొన్ని సంవత్సరాలుగా సాగుతున్న ఉద్యోగాల తొలగింపు ప్రక్రియతో పోలిస్తే, 2026 మొదటి అర్ధభాగంలో ఈ సంఖ్య మరింత పెరిగినట్లు మార్కెట్ వర్గాల డేటా స్పష్టం చేస్తోంది. గతేడాది ఇదే సమయంతో పోలిస్తే లేఆఫ్స్ తీవ్రత ఈ ఏడాది గణనీయంగా పెరిగింది. పెద్ద పెద్ద టెక్ దిగ్గజాల నుండి చిన్న స్థాయి స్టార్టప్‌ల వరకు అనేక కంపెనీలు తమ వ్యాపార పునర్వ్యవస్థీకరణ, వ్యయాలను తగ్గించుకోవడం, మారుతున్న మార్కెట్ డిమాండ్లకు అనుగుణంగా మారే ప్రక్రియలో భాగంగా ఈ కఠిన నిర్ణయాలు తీసుకున్నాయి.టెక్ రంగంలో ఈ స్థాయిలో ఉద్యోగాల నష్టం జరగడం వల్ల మార్కెట్లో నిరుద్యోగిత సవాళ్లు కూడా పెరుగుతున్నాయి. కంపెనీలు తమ లాభాలను నిలబెట్టుకోవడానికి, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి కొత్త విభాగాల్లో పెట్టుబడులను సర్దుబాటు చేయడానికి ప్రస్తుతమున్న సిబ్బందిపై వేటు వేస్తున్నట్లు విశ్లేషణలు పేర్కొంటున్నాయి. రాబోయే ఆరు నెలల కాలంలో ఈ ట్రెండ్ ఇలాగే కొనసాగుతుందా లేదా మార్కెట్ పుంజుకుని ఐటీ రంగానికి ఉపశమనం లభిస్తుందా అనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది.

## అక్రమ వీడియోల తొలగింపుపై హైకోర్టుకు గూగుల్ కీలక వివరణ


**కోర్టు విచారణల వీడియోలను అరికట్టడం అసాధ్యమన్న ఢిల్లీ హైకోర్టు**

**యూట్యూబ్‌ను ముందుగానే పర్యవేక్షించి వీడియోలను తొలగించడం సాధ్యం కాదని వెల్లడి**

**కేజ్రీవాల్ విచారణ వీడియోలు వైరల్ కావడంతో దాఖలైన పిటిషన్‌పై విచారణ**

**నిర్దిష్ట యూఆర్‌ఎల్‌లతో కోర్టు ఆదేశిస్తేనే వీడియోలను తొలగిస్తామని వెల్లడి**

**చట్టబద్ధతను నిర్ధారించేది కోర్టులే కానీ తాము కాదని అఫిడవిట్**




కోర్టు విచారణలకు సంబంధించిన అనధికారిక రికార్డింగులను యూట్యూబ్‌లో అప్‌లోడ్ కాకుండా ముందస్తుగా పర్యవేక్షించడం లేదా వాటిని తొలగించడం సాధ్యం కాదని టెక్ దిగ్గజం గూగుల్ ఢిల్లీ హైకోర్టుకు స్పష్టం చేసింది. ఇది చట్టపరంగా తప్పనిసరి కాదని, సాంకేతికంగానూ అసాధ్యమని పేర్కొంటూ ఈ మేరకు కోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది.ఎక్సైజ్ పాలసీ కేసులో అరవింద్ కేజ్రీవాల్ కోర్టు విచారణకు హాజరైన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. దీనిపై న్యాయవాది వైభవ్ సింగ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేస్తూ, కోర్టు విచారణలకు సంబంధించిన అనధికారిక రికార్డింగులను అరికట్టేలా సోషల్ మీడియా వేదికలను ఆదేశించాలని కోరారు. ఈ పిటిషన్‌పై స్పందిస్తూ గూగుల్ తన వాదనలను వినిపించింది.పిటిషనర్ గుర్తించిన నిర్దిష్ట వీడియోలను ఇప్పటికే తొలగించామని, భారత్‌లో బ్లాక్ చేశామని గూగుల్ వెల్లడించింది. అయితే, తమ ప్లాట్‌ఫామ్‌లో ప్రతిరోజూ అప్‌లోడ్ అయ్యే లక్షలాది వీడియోలను పరిశీలించి, వాటిలో కోర్టు విచారణలకు సంబంధించిన వాటిని గుర్తించడం సాధ్యం కాదని పేర్కొంది. ఏదైనా కంటెంట్ చట్టబద్ధతను న్యాయస్థానాలే నిర్ధారించాలని, కేవలం ఓ మాధ్యమంగా ఉన్న తాము ఆ నిర్ణయం తీసుకోలేమని స్పష్టం చేసింది. నిర్దిష్ట యూఆర్‌ఎల్‌లతో కోర్టు ఆదేశాలు జారీ చేస్తే తప్ప, కంటెంట్‌ను తొలగించలేమని గూగుల్ తన అఫిడవిట్‌లో వివరించింది.న్యాయవ్యవస్థ ప్రయోజనాల దృష్ట్యా అనధికారిక రికార్డింగ్‌ల అంశంపై సమర్థవంతమైన నియంత్రణ అవసరమని గతంలో హైకోర్టు అభిప్రాయపడిన విషయం తెలిసిందే. తాజా పరిణామం న్యాయవ్యవస్థ పవిత్రతను కాపాడటంలో ఎదురవుతున్న సవాళ్లను, టెక్ ప్లాట్‌ఫామ్‌లు ఎదుర్కొంటున్న ఆచరణాత్మక ఇబ్బందులను స్పష్టం చేస్తోంది.

# తక్కువ వడ్డీకే "పర్సనల్ లోన్" ఇస్తున్న బ్యాంకులివే!

**ఎందులో ఎంత ఉందంటే**

**పర్సనల్ లోన్ తీసుకునే ఆలోచనలో ఉన్నారా**

**బెస్ట్ బ్యాంకు, ఫైనాన్స్ కంపెనీని ఎంచుకోండిలా!**




మనందరికీ ఏదో ఒక సందర్భంలో డబ్బు అత్యవసరం అవుతుంది. అలాంటి టైమ్‌లో ఎక్కువమందికి ముందుగా గుర్తొచ్చేవి "పర్సనల్ లోన్స్ (వ్యక్తిగత రుణాలు)". పిల్లల చదువు, వివాహం, అత్యవసర వైద్య పరిస్థితి ఇలా దేనికి మనీ కావాలన్నా మెజార్టీ జనాలు పర్సనల్ లోన్స్ తీసుకోవడానికే ఆసక్తి చూపిస్తుంటారు. అత్యవసర పరిస్థితుల్లో డబ్బులు అవసరమైనప్పుడు ఈ రుణాలు మంచి ఫైనాన్సింగ్ ఎంపికగా ఉంటాయి. అయితే, చాలా బ్యాంకులు/ఎన్‌బీఎఫ్‌సీలు(నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ) మెరుగైన క్రెడిట్ స్కోరు(750ం) గలవారికి సరసమైన వడ్డీ రేట్లకే పర్సనల్ లోన్ ఇస్తుంటాయి. వీటికోసం ఆన్‌లైన్‌లో అప్లై చేసుకోవచ్చు.కొన్ని సందర్భాల్లో రుణ సంస్థలు పరిమిత కాలానికి ప్రత్యేక వడ్డీ రేట్లను అందిస్తుంటాయి. అటువంటి ఆఫర్లు అమల్లో ఉన్నప్పుడు లోన్ కోసం అప్లై చేస్తే, తక్కువ వడ్డీ రేటుతో రుణాన్ని పొందడానికి అవకాశం ఉంటుందంటున్నారు ఆర్థిక నిపుణులు. అయితే, వివిధ బ్యాంకులు/ఎన్‌బీఎఫ్‌సీలు వ్యక్తిగత రుణాలపై వసూలు చేసే వడ్డీ రేట్లపై వ్యత్యాసాలు ఉంటాయి. అందుకే, పర్సనల్ లోన్‌కి అప్లై చేసే ముందు వివిధ రుణ సంస్థలు వసూలు చేసే వడ్డీ రేట్లు, ప్రాసెసింగ్ ఫీజులను ఒకసారి సరిపోల్చుకోవాలని సూచిస్తున్నారు. ఆ తర్వాతే నిర్ణయం తీసుకోవడం మంచిదంటున్నారు.

**వివిధ రుణ సంస్థలు పర్సనల్ లోన్స్‌పై వసూలు చేసే వడ్డీ రేట్ల వివరాలిలా..**

| బ్యాంకు/ఎన్‌బీఎఫ్‌సీ పేరు | వడ్డీ రేటు (శాతంలో) | సంవత్సరానికి ప్రాసెసింగ్ ఫీజు (శాతంలో) |
|---|---|---|
| బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర | 8.75% | 1% వరకు |
| మహీంద్రా ఫైనాన్స్ | 8.00% | 2% వరకు |
| యూనియన్ బ్యాంక్ | 8.75% | 1% వరకు |
| పంజాబ్ అండ్ సింధ్ బ్యాంకు | 9.60% | 1% వరకు |
| కెనరా బ్యాంకు | 9.70% | 0.5% వరకు |
| హెచ్‌ఎస్‌బీసీ బ్యాంకు | 9.75% | 2% వరకు |
| సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా | 9.85% | 1% వరకు |
| యూకో బ్యాంకు | 9.95% | 1% వరకు |
| కోటక్ మహీంద్రా బ్యాంకు | 9.98% | 5% వరకు |
| ఐసీఐసీఐ బ్యాంకు | 9.99% | 2% వరకు |
| హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు | 9.99% | రూ. 6,500 వరకు |
| ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకు | 9.99% | 2% వరకు |
| పూనావాలా ఫిన్‌కార్ప్ | 9.99% | 3% వరకు |
| యాక్సిస్ బ్యాంకు | 9.99% | 2% వరకు |
| బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్ | 10.00% | 3.93% వరకు |
| చోళమండలం ఐఎఫ్‌సీ | 10.00% | 4% వరకు |
| బ్యాంక్ ఆఫ్ బరోడా | 10.15% | 2% వరకు |
| ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు | 10.25% | 0.75% వరకు |
| పంజాబ్ నేషనల్ బ్యాంకు | 10.25% | 1% వరకు |
| ఇండస్‌ఇండ్ బ్యాంకు | 10.35% | 3.5% వరకు |
| బ్యాంక్ ఆఫ్ ఇండియా | 10.85% | 1% వరకు |
| ఆదిత్య బిర్లా ఫైనాన్స్ | 10.99% | 4% వరకు |
| టాటా క్యాపిటల్ | 10.99% | 3.5% వరకు |
| ఎల్ అండ్ టీ ఫైనాన్స్ | 11.00% | 3% వరకు |
| శ్రీరామ్ ఫైనాన్స్ | 11.00% | 5% వరకు |
| ఫెడరల్ బ్యాంకు | 12.00% | 2% వరకు |

నోట్ : పైన పేర్కొన్న పట్టికలో వ్యక్తిగత రుణాలపై అత్యల్ప వడ్డీ రేట్లు అందిస్తున్న బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల వివరాలు మాత్రమే తెలిపాం. ముఖ్యంగా ఈ వడ్డీ రేట్లు అనేవి దరఖాస్తుదారుని క్రెడిట్ స్కోరు, లోన్ మొత్తం, నెలవారీ ఇన్‌కమ్, వృత్తి, వయసు, బ్యాంకుతో సంబంధాలు మొదలైన వాటిపై ఆధారపడి ఉంటాయని గుర్తుంచుకోవాలి.

**ఈ జాగ్రత్తలు తప్పనిసరి!**

పర్సనల్ లోన్ కోసం అప్లై చేసేటప్పుడు తప్పులు చేయకుండా మీరు కొన్ని నియమాలు పాటించాలి. లోన్ తీసుకునేటప్పుడు తగిన శ్రద్ధ వహించకపోతే, వ్యక్తిగత రుణం కూడా అనేక ఆర్థిక ఇబ్బందులను కలిగిస్తుందంటున్నారు. అందుకే, పర్సనల్ లోన్ మీకు అనుకూలంగా పనిచేసేలా చూసుకోవడానికి కొన్ని జాగ్రత్తలు తప్పనిసరి అంటున్నారు నిపుణులు. అలాంటి వాటిల్లో కొన్నింటి గురించి ఇప్పుడు చూద్దాం.లోన్ తీసుకున్నాక మీరు టైమ్‌కు ఈఎంఐలు చెల్లించాలి. ఎందుకంటే ఇవి ఆలస్యం చేయడం లేదా అసలు కట్టకపోవడం వల్ల జరిమానాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని చెబుతున్నారు నిపుణులు.స్పష్టమైన చెల్లింపుల వ్యూహం లేకుండా లోన్ తీసుకోవడం వల్ల మీ నెలవారీ బడ్జెట్ అస్తవ్యస్తమయి డిఫాల్ట్‌లకు దారితీస్తుందంటున్నారు. పర్సనల్ లోన్‌పై డిఫాల్ట్ అవ్వడం వల్ల రుణగ్రహీతకు అనేక ఇబ్బందులు ఎదురవుతాయి.ఒకసారి అనేక రుణాలు తీసుకోకూడదు. ఇది మీ క్రెడిట్‌కు అంత మంచిది కాదు. అంతేకాదు, బహుళ రుణాలు కొన్నిసార్లు మిమ్మల్ని రుణ ఉచ్చులోకి నెట్టే ఛాన్స్ ఉంది. వీటితో పాటు దరఖాస్తు టైమ్‌లో కూడా జాగ్రత్తగా అన్ని వివరాలు తెలుసుకుని పర్సనల్ లోన్ తీసుకోవడం మంచిదంటున్నారు నిపుణులు.

# భారత్‌లో టెస్లా కొత్త ఛార్జింగ్ కేంద్రం.. షాపింగ్ చేస్తూనే కారుకు ఛార్జింగ్

**ఉత్తర భారతంలో తొలిసారిగా ఇన్-మాల్ ఛార్జింగ్ కేంద్రాన్ని ప్రారంభించిన టెస్లా**

**ఢిల్లీలోని నెక్సస్ సెలెక్ట్ సిటీవాక్ మాల్‌లో 6 ఛార్జింగ్ పాయింట్ల ఏర్పాటు**

**కొత్తగా మోడల్ వై ఎల్, 2026 మోడల్ వై ప్రీమియం ఆర్‌డబ్ల్యూడీ వేరియంట్ల ప్రదర్శన**

**భారత్‌లో టెస్లా ఛార్జింగ్ కేంద్రాల సంఖ్య 6కు చేరినట్లు వెల్లడి**

**టెస్లా కార్ల బుకింగ్స్ ప్రారంభం.. దేశవ్యాప్తంగా హోమ్ ఛార్జింగ్ సపోర్ట్**




ప్రముఖ ఎలక్ట్రిక్ వాహన తయారీ సంస్థ టెస్లా, భారత్‌లో తన ఛార్జింగ్ నెట్‌వర్క్‌ను వేగంగా విస్తరిస్తోంది. ఇందులో భాగంగా ఉత్తర భారతదేశంలోనే మొట్టమొదటి ఇన్-మాల్ ఛార్జింగ్ కేంద్రాన్ని నేడు ఢిల్లీలో ప్రారంభించినట్లు ప్రకటించింది. ఢిల్లీలోని నెక్సస్ సెలెక్ట్ సిటీవాక్ మాల్‌లో ఈ సౌకర్యాన్ని ఏర్పాటు చేసింది. దీంతో వినియోగదారులు షాపింగ్ లేదా డైనింగ్ చేసే సమయంలోనే తమ టెస్లా కార్లకు ఛార్జింగ్ పెట్టుకునే వీలు కలుగుతుంది.ఈ కొత్త ఛార్జింగ్ కేంద్రంలో 11 కిలోవాట్ల సామర్థ్యం గల ఆరు డెస్టినేషన్ ఛార్జర్లను (ఏసీ) ఏర్పాటు చేసినట్లు కంపెనీ తెలిపింది. మాల్‌లోనిా1 పార్కింగ్ ఏరియాలో ఉన్న ఈ ఛార్జర్లు 99.95 శాతం అప్‌టైమ్‌తో అత్యంత విశ్వసనీయంగా పనిచేస్తాయని పేర్కొంది. ఈ కొత్త కేంద్రంతో కలిపి భారత్‌లో టెస్లా నిర్వహిస్తున్న ఛార్జింగ్ స్టేషన్ల సంఖ్య 6కి చేరింది. దేశవ్యాప్తంగా ఇప్పుడు మొత్తం 20 సూపర్‌ఛార్జర్లు, 20 డెస్టినేషన్ ఛార్జర్లు అందుబాటులోకి వచ్చాయి.ఈ సందర్భంగా, టెస్లా తన కొత్త మోడళ్లను ప్రదర్శించేందుకు జులై 6 నుంచి 10 వరకు అదే మాల్‌లో ఒక పాప్-అప్ స్టోర్‌ను కూడా నిర్వహిస్తోంది. ఇక్కడకు వచ్చే సందర్శకులు కొత్తగా విడుదలైన మోడల్ వై ఎల్, 2026 మోడల్ వై ప్రీమియం రియర్-వీల్ డ్రైవ్ (ఆర్‌డబ్ల్యూడీ) కార్లను దగ్గర నుంచి చూసే అవకాశం ఉంది. సంస్థ ప్రతినిధులు ఈ కార్ల ఫీచర్లను వివరించడంతో పాటు, టెస్ట్ డ్రైవ్ సౌకర్యాన్ని కూడా కల్పిస్తున్నారు. కొత్త మోడళ్ల వివరాలు: మోడల్ వై ఎల్ ఆరు సీట్ల సామర్థ్యంతో, ఆల్-వీల్ డ్రైవ్ ఆప్షన్‌తో వస్తుంది. మూడు వరుసల సీటింగ్ లేఅవుట్ ఉన్న ఈ ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ ఒక్కసారి ఛార్జింగ్‌తో 681 కిలోమీటర్ల (డబ్ల్యూఎల్‌టీపీ) రేంజ్ ఇస్తుందని కంపెనీ చెబుతోంది. ఇది కేవలం 5 సెకన్లలో 0 నుంచి 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. దీని ప్రారంభ ధర రూ. 61.99 లక్షలుగా ఉంది.ఇక, ఐదు సీట్ల సామర్థ్యం గల 2026 మోడల్ వై ప్రీమియం ఆర్‌డబ్ల్యూడీ, ఒక్కసారి ఛార్జింగ్‌తో 500 కిలోమీటర్ల (డబ్ల్యూఎల్‌టీపీ) రేంజ్ అందిస్తుంది. ఇది 5.9 సెకన్లలో 0 నుంచి 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. దీని ప్రారంభ ధర రూ. 50.89 లక్షలుగా నిర్ణయించారు.ఈ రెండు మోడళ్లు కూడా యూరో ఎన్‌సీఏపీ, ఎన్‌హెచ్‌టీఎస్‌ఏ వంటి గ్లోబల్ ఏజెన్సీల నుంచి టాప్ సేఫ్టీ రేటింగ్స్ అందుకున్నాయని కంపెనీ స్పష్టం చేసింది. ఈ కార్లను టెస్లా అధికారిక వెబ్‌సైట్ ద్వారా బుక్ చేసుకోవచ్చని, దేశంలోని అన్ని రాష్ట్రాల్లో హోమ్ ఛార్జింగ్ సపోర్ట్ అందుబాటులో ఉందని సంస్థ వెల్లడించింది.

# మారుతి కార్లపై జూలై డిస్కౌంట్లు

**విక్టోరిస్‌పై రూ. 2 లక్షల వరకు బెనిఫిట్స్!**

**మారుతి అరేనా కార్లపై జూలై నెలలో భారీ డిస్కౌంట్లు**

**విక్టోరిస్ ఎస్‌యూవీపై రూ. 2 లక్షల వరకు ప్రయోజనాలు**

**బ్రెజా, స్విఫ్ట్, వ్యాగన్ ఆర్ వంటి మోడళ్లపై కూడా ఆకర్షణీయమైన ఆఫర్లు**

**ప్రముఖ మోడళ్లు డిజైర్, ఎర్టిగాలపై లేని డిస్కౌంట్లు**




దేశంలోని అతిపెద్ద కార్ల తయారీ సంస్థ మారుతి సుజుకి, జూలై నెలకు గాను తన ఎరీనా డీలర్‌షిప్ నెట్‌వర్క్‌లోని పలు ప్రముఖ మోడళ్లపై ఆకర్షణీయమైన డిస్కౌంట్లను ప్రకటించింది. పోటీ మార్కెట్లో విక్రయాల జోరును కొనసాగించేందుకు కంపెనీ ఈ ఆఫర్లను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ దఫా అందిస్తున్న రాయితీలలో 'మారుతి విక్టోరిస్' ఎస్‌యూవీ ప్రధాన ఆకర్షణగా నిలిచింది.ఈ నెలలో విక్టోరిస్ ఎస్‌యూవీపై గరిష్ఠ ప్రయోజనాలను కల్పిస్తున్నారు. ముఖ్యంగా సీఎన్‌జీ వేరియంట్లపై ఎక్స్ఛేంజ్ బెనిఫిట్స్‌తో కలిపి రూ. 2 లక్షల వరకు లబ్ధి పొందే అవకాశం ఉందని సమాచారం. ఇక పెట్రోల్, హైబ్రిడ్ వేరియంట్లపై ఎక్స్ఛేంజ్ బోనస్, లాయల్టీ రివార్డులు, కార్పొరేట్ స్కీమ్‌ల రూపంలో రూ. 60,000 నుంచి రూ. 90,000 వరకు డిస్కౌంట్లు లభిస్తున్నాయి.ఎరీనా నెట్‌వర్క్‌లోని ఇతర మోడళ్లపై కూడా సంస్థ భారీ ఆఫర్లను ప్రకటించింది. బ్రెజాపై రూ. 55,000 వరకు, ఆల్టో కే10 మరియు వ్యాగన్ ఆర్‌లపై రూ. 52,500 వరకు, స్విఫ్ట్‌పై రూ. 45,000 వరకు ప్రయోజనాలు కల్పిస్తున్నారు. ఎస్-ప్రెసో, సెలెరియో, ఈకో వంటి మోడళ్లపై రూ. 37,500 వరకు రాయితీలు ఉన్నాయి. అయితే, అత్యంత ప్రజాదరణ పొందిన డిజైర్, ఎర్టిగా మోడళ్లపై ఈ నెలలో ఎటువంటి ఆఫర్లు లేవని కంపెనీ స్పష్టం చేసింది.వర్షాకాలంలో విక్రయాలను పెంచుకోవడంతో పాటు స్టాక్‌ను క్లియర్ చేసుకునే వ్యూహంలో భాగంగా మారుతి ఈ నిర్ణయం తీసుకుంది. నగదు తగ్గింపు, ఎక్స్ఛేంజ్ బోనస్, లాయల్టీ రివార్డుల రూపంలో ఈ ఆఫర్లు అందుబాటులో ఉన్నాయి. అయితే, ఈ ప్రయోజనాలు నగరం, డీలర్‌షిప్ మరియు స్టాక్ లభ్యతను బట్టి మారే అవకాశం ఉంటుంది. కావున, కొనుగోలుదారులు పూర్తి వివరాల కోసం సమీపంలోని ఎరీనా షోరూమ్‌ను సంప్రదించాల్సి ఉంటుంది.



## కష్టాల్లో కాపాడేవాడే నిజమైన రాజు'.. ట్రైలర్ రిలీజ్

రుత్విక్, విశాఖ ధిమాన్ జంటగా వస్తోన్న లేటేస్ట్ మూవీ రాజా ది రాజా. ఈ చిత్రానికి అనిల్ బోయిడపు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాను వృందావన్ క్రియేషన్స్ బ్యానర్‌లో దాసరి నిహారిక నిర్మిస్తున్నారు. తాజాగా ఈ మూవీ ట్రైలర్ రిలీజ్ చేశారు మేకర్స్.


ఈ ట్రైలర్ చూస్తుంటే రాజు అనే కాన్సెప్ట్ ప్రధానంగా తెరకెక్కించినట్లు తెలుస్తోంది. రాజుల కాలానికి.. ప్రజెంట్‌కు లింక్ పెట్టి ఈ కథను రూపొందించినట్లు ట్రైలర్‌లో కనిపిస్తోంది. లవ్, ఫ్యామిలీ ఎమోషన్స్ కూడా ఈ కథలో ఉండనున్నాయని ట్రైలర్‌లో చూపించారు. ఈ సినిమాకు మార్క్ కె రాబిన్ సంగీతమందించారు. ఈ మూవీలో సాయి కుమార్, నరేశ్, అవసరాల శ్రీనివాస్, విష్ణు, పార్వతీశం, రాజశ్రీ నాయర్, రోహిణి, భద్రం, మైమ్ మధు, ఆనంద్ కీలక పాత్రల్లో నటించారు. ఇంకెందుకు ఆలస్యం ట్రైలర్ మీరు కూడా చూసేయండి.

## అఖిల్‌పై ఆ భయం ఉండేది.. 'లెనిన్' చూసి ఆశ్చర్యపోయా : నాగార్జున



"లెనిన్' రాయలసీమ కథ. సింపుల్‌గా చెప్పాలంటే సీమలో జరుగుతున్న మహాభారతం. ఈ సినిమాకు ముందు అఖిల్ ఎక్కువగా అర్బన్ ఫిల్మ్స్ చేశాడు. మరి... ఈ సినిమాకి సూట్ అవుతాడా? అని ముందు నాకు భయంగా ఉండేది. కానీ సినిమా చూశాక, నేను కాదు... అందరూ ఆశ్చర్యపోయారు. 'లెనిన్' రోల్‌లోకి అఖిల్ వెళ్లిపోయాడు. సినిమా చూసిన తర్వాత లెనిన్ స్నేహాన్ని, ప్రేమను, పగని కూడా ప్రేమిస్తారు. లెనిన్ ను మీరు ఇంటికి తీసుకెళ్లిపోతారు. మీకు అఖిల్ కనపడడు... 'లెనిన్ ' కనిపిస్తాడు" అని నాగార్జున అన్నారు. అఖిల్, భాగ్యశ్రీ భోర్సే హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'లెనిన్ '. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో మురళీ కిషోర్ అబ్బూరు (నందు) దర్శకత్వంలో అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 10న విడుదల కానుంది. ఆదివారం తిరుపతిలో జరిగిన 'లెనిన్' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో నాగార్జున మాట్లాడుతూ-- "ప్రేమ కోసం యుద్ధాలు జరిగాయి. ప్రేమకోసం రాజ్యాలు కూలిపోయాయి. 'లెనిన్'లో కూడా ఒక ప్రేమకథ ఉంది. నందు ఈ సినిమా కథ చెప్పడానికి వచ్చినప్పుడు ఇది శ్రీరామపురంలో జరిగే కథ అన్నాడు. 'శ్రీరామపురం' అంటే మా నాన్నగారు పుట్టిన ఊరు (కృష్ణా జిల్లా). అయితే ఈ శ్రీరామపురం చిత్తూరు జిల్లాలో అని చెప్పాడు. కానీ శ్రీరామపురం అంటే నాకో సెంటిమెంట్. దీంతో నందును కథ చెప్పమన్నాను. నందు కథ చెప్పడం మొదలు పెట్టాడు. ఇందులో పాత్రలు డిఫరెంట్‌గా అనిపించాయి. 'లెనిన్' సెకండాఫ్‌లోని ట్విస్ట్‌లను ప్రేక్షకులు ఊహించలేరు. మా పార్ట్‌నర్ నాగవంశీకి ఈ సినిమాపై ఎంత కాన్ఫిడెన్స్ అంటే... ఏపీ అంతా అతనే డిస్ట్రిబ్యూట్ చేస్తున్నాడు. మన అందరికీ దేవుడు ఆ వెంకటేశ్వరస్వామి. నాన్నగారు ఎప్పుడూ అంటుంటారు ఆయనకు దేవుడు మాత్రం ప్రేక్షక దేవుళ్ళు అని. సో... ఈ ప్రేక్షక దేవుళ్లకు చెబుతున్నాను. జులై 10న వస్తున్నాం. మనవాడు కొడుతున్నాడు" అని అన్నారు. అఖిల్ మాట్లాడుతూ-- "లెనిన్'ఉద్దేశం ఒకటే. నేను మీ ఇంటివాడినైపోవాలి. మీ సీమ బిడ్డ మురళీకిషోర్ రెండేళ్ల క్రితం ఈ సినిమా కథ చెప్పారు. నేను చేయాలనుకున్న కథ ఇదే అనిపించింది" అన్నారు. "ఈ మూవీలో భారతి అనే పాత్ర చేశాను. ఈ సినిమా నా కెరీర్‌లో చాలా స్పెషల్" అన్నారు భాగ్యశ్రీ బోర్సే. "నాగేశ్వరరావుగారి మనవడు, నాగార్జునగారి అబ్బాయి అఖిల్ గోల్డెన్ స్పూన్ తో పుట్టాడు. పెద్ద కష్టపడలేదని అంటుంటారు. కానీ సోల్ ఆఫ్ లెనిన్ వచ్చినప్పట్నుంచి 'అఖిల్ ఫస్ట్ టైమ్ కష్టపడుతున్నట్లు కనిపిస్తుంది కదరా' అనేవాళ్లు. ఈ అభిప్రాయాన్ని జనాల్లోకి తీసుకుని వెళ్లేందుకు అఖిల్‌గారు ఎంత కష్టపడ్డారో మేం చూశాం. ఇది రెగ్యులర్ మాస్ మూవీ కాదు. రెండు మూడు చోట్ల ఆడియన్స్ సర్‌ప్రైజ్ అవుతారు. అలాంటి స్క్రీన్‌ప్లే రాశాడు నందు" అన్నారు నాగవంశీ. బ్రహ్మాజీ, సునీల్ మాట్లాడారు.

## ఫుల్ స్పీడ్‌లో రవితేజ.. 'ఇరుముడి' రిలీజ్‌కు ముందే కొత్త సినిమా, శ్రీవిష్ణుతో మల్టీస్టారర్?




మాస్ మహారాజా రవితేజ వరుస ప్రాజెక్టులతో దూసుకుపోతున్నారు. ఈ ఏడాది సంక్రాంతికి ప్రేక్షకులను అలరించిన ఆయన, ఇప్పుడు మరోసారి బిజీ షెడ్యూల్‌తో అభిమానులకు వరుస సినిమాలను అందించేందుకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం నటిస్తున్న ఆధ్యాత్మిక యాక్షన్ డ్రామా 'ఇరుముడి' చివరి దశ షూటింగ్‌లో ఉండగానే, మరో కొత్త ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు టాలీవుడ్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. తాజా సమాచారం ప్రకారం, 'రాజా రాజా చోర' ఫేమ్ దర్శకుడు హసిత్ గోలి దర్శకత్వంలో రవితేజ ఓ వినోదాత్మక చిత్రంలో నటించనున్నారని తెలుస్తోంది. ఈ సినిమాలో టాలెంటెడ్ హీరో శ్రీవిష్ణు కూడా కీలక పాత్రలో కనిపించే అవకాశం ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి. వీశీజఱవం హసిత్ గోలి శైలికి తగ్గట్టుగా హాస్యం, వినూత్న కథనం ప్రధాన బలాలుగా ఈ చిత్రాన్ని రూపొందించనున్నట్లు సమాచారం. ఈ నెలలో పూజా కార్యక్రమాలతో సినిమాను ప్రారంభించి, వచ్చే నెల నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారట. వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా చిత్రాన్ని విడుదల చేయాలని మేకర్స్ లక్ష్యంగా పెట్టుకున్నట్లు టాక్ వినిపిస్తోంది. అయితే ఈ మల్టీస్టారర్ ప్రాజెక్ట్‌పై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. ఇదిలా ఉంటే, రవితేజ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఇరుముడి' చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కిస్తున్న ఈ సినిమా భక్తి, కుటుంబ భావోద్వేగాలు, యాక్షన్ అంశాల మేళవింపుగా రూపొందుతోంది. ఈ చిత్రాన్ని ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. ఈ సినిమాలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ కథానాయికగా నటిస్తుండగా, మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఇటీవల విడుదలైన 'ఇరుముడి కట్టు.. శబరిమల ఎక్కు' పాటకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తోంది.

## అఖిల్ అక్కినేని 'లెనిన్' లో తారక్ రోల్ ఏంటీ.. హైప్ పెంచేస్తున్న నయా పోస్టర్



టాలీవుడ్ యాక్టర్ అక్కినేని అఖిల్ లాంగ్ గ్యాప్ తర్వాత 'లెనిన్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడని తెలిసిందే. మురళీ కిషోర్ అబ్బూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మిస్టర్ బచ్చన్ ఫేం భాగ్య శ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ చిత్రం జులై 10న గ్రాండ్‌గా విడుదల కానుంది. ప్రమోషన్స్‌లో భాగంగా మేకర్స్ లాంచ్ చేసిన కొత్తపోస్టర్ అభిమానులు, మూవీ లవర్స్‌లో క్యూరియాసిటీ పెంచేస్తోంది. ఈ మూవీలో జూనియర్ ఎన్టీఆర్ కూడా భాగం కాబోతున్నాడని ఇన్‌సైడ్ టాక్. అదెలా అంటే తాజా పోస్టర్‌లో టైగర్ లుక్‌తో పాటు లెనిన్ టైటిల్ లోగోను చూడొచ్చు. ఇంతకీ ఈ కొత్త పోస్టర్ వెనుకున్న సీక్రెట్ ఏంటంటే.. ఈ చిత్రానికి యంగ్ టైగర్, మ్యాన్ ఆఫ్ మాసెస్ జూనియర్ ఎన్టీఆర్ వాయిస్ ఓవర్ అందించడమే కాకుండా సినిమా కథనాన్ని వివరించబోతున్నాడట. ఈ పోస్టర్‌తో సినిమాలో తారక్ రోల్ ఏంటనేది క్లారిటీ ఇచ్చేసినట్టేనని అర్థమవుతోంది. ఈ మూవీని అన్నపూర్ణ స్టూడియోస్‌తోపాటు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లపై అక్కినేని నాగార్జున, నాగ వంశీ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. రొమాంటిక్ యాక్షన్ డ్రామాగా వస్తున్న ఈ చిత్రంలో శివాజీ, సునీల్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన లెనిన్ టైటిల్ గ్లింప్స్ మూవీ విలేజ్ బ్యాక్‌డ్రాప్ నేపథ్యంలో సాగనున్నట్టు హింట్ ఇచ్చేసింది. లెనిన్ పోస్ట్ థియాట్రికల్ రైట్స్‌ను పాపులర్ టెలివిజన్ నెట్‌వర్క్ జీ దక్కించుకుంది. జీ నెట్‌వర్క్ లెనిన్ మూవీ డిజిటల్, శాటిలైట్ రైట్స్‌ను దక్కించుకుంది. థియాట్రికల్ రన్ తర్వాత జీ5లో ప్రీమియర్ కానుంది. అంతేకాదు జీ తెలుగు, జీ సినిమాలులో టెలివిజన్ ప్రీమియర్ కానుంది. ఆయా ప్లాట్‌ఫాంలలో విడుదల తేదీలపై మేకర్స్ థియాట్రికల్ రిలీజ్ తర్వాత క్లారిటీ ఇవ్వనున్నారు.

## ఓటీటీలోకి వచ్చి రెండు రోజుల్లోనే మాయమైన 'సత్లుజ్'.. ఈ సినిమా వెనుక ఇంత పెద్ద కథ ఉందా?




సాధారణంగా ఒక సినిమా విడుదలకు ముందు ఎన్నో అడ్డంకులు ఎదుర్కొంటుంది. సెన్సార్ సమస్యలు, కోర్టు కేసులు, ఆర్థిక ఇబ్బందులు, టైటిల్ వివాదాలు వంటి కారణాలతో సినిమాలు వాయిదా పడటం కొత్త విషయం కాదు. అయితే ఓటీటీలో విడుదలైన కేవలం రెండు రోజుల్లోనే స్ట్రీమింగ్‌ను నిలిపివేయడం మాత్రం అరుదుగా జరిగే పరిణామం. ఇప్పుడు పంజాబీ స్టార్ నటుడు, గాయకుడు దిల్జిత్ దొసాంజే ప్రధాన పాత్రలో నటించిన 'సత్లుజ్' సినిమా ఇదే కారణంగా దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. పంజాబ్‌కు చెందిన ప్రముఖ మానవ హక్కుల కార్యకర్త జస్వంత్ సింగ్ ఖల్రా జీవిత కథ ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కింది. 1990లలో పంజాబ్‌లో అదృశ్యమైన పలువురు వ్యక్తుల కేసులను పరిశోధించి కీలక ఆధారాలను వెలికితీసిన ఖల్రా, అనంతరం 1995లో హత్యకు గురయ్యారు. ఆయన జీవితంలో జరిగిన వాస్తవ సంఘటనలను ఆధారంగా తీసుకుని దర్శకుడు హనీ ట్రెహన్ ఈ చిత్రాన్ని రూపొందించారు. మొదట ఈ సినిమాకు 'ఘల్లుఘరా' అనే టైటిల్ ప్రకటించారు. అనంతరం దాన్ని 'పంజాబ్ 95'గా మార్చగా, చివరికి ఓటీటీ విడుదల సమయంలో 'సత్లుజ్' పేరుతో ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. ఈ సినిమా 2022లోనే పూర్తయినప్పటికీ విడుదల మాత్రం సాధ్యం కాలేదు. కారణం సెన్సార్ వివాదాలు. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (జదీఖీజ) మొదట కొన్ని హింసాత్మక సన్నివేశాలు, సంభాషణలు, టైటిల్‌పై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ 21 మార్పులు సూచించింది. నిర్మాతలు ఆ మార్పులు చేసిన తర్వాత మళ్లీ సెన్సార్‌కు వెళ్లగా, ఈసారి ఏకంగా 127 కట్స్ సూచించినట్లు సమాచారం. అంతటి మార్పులు చేస్తే సినిమా అసలు ఉద్దేశమే దెబ్బతింటుందని భావించిన చిత్రబృందం కోర్టును ఆశ్రయించింది. దీంతో సినిమా విడుదల మరింత ఆలస్యమైంది. థియేటర్లలో విడుదలకు మార్గం సుగమం కాకపోవడంతో, చిత్రబృందం ఎలాంటి హడావుడి లేకుండా జూలై 3న జీ5 (జుజు5) ఓటీటీ వేదికగా 'సత్లుజ్'ను విడుదల చేసింది. ఈ సందర్భంగా హీరో దిల్జిత్ దొసాంజే స్పందిస్తూ.. ఓటీటీలో విడుదలైనది పూర్తిస్థాయి ఒరిజినల్ వెర్షనేనని, ఒకవేళ కట్స్ చేసి విడుదల చేసి ఉంటే తాను ఆ సినిమాను ప్రమోట్ కూడా చేసేవాడిని కాదని స్పష్టం చేశారు. అయితే విడుదలైన రెండు రోజులకే భారతదేశంలో జీ5 ప్లాట్‌ఫామ్ నుంచి సినిమా కనిపించకుండా పోవడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. దీనిపై స్పందించిన జీ5 యాజమాన్యం.. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో సినిమాను తాత్కాలికంగా నిలిపివేస్తున్నామని, చట్టపరమైన అంశాలను పరిశీలించిన తర్వాత మళ్లీ అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశం ఉందని తెలిపింది. అయితే సినిమా తొలగింపుకు అసలు కారణం ఏమిటన్న విషయాన్ని మాత్రం అధికారికంగా వెల్లడించలేదు. దీంతో సోషల్ మీడియాలో అనేక ఊహాగానాలు మొదలయ్యాయి.


The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.com epaper.vaarthasandhya.com. Cell : 73961 22101 , 99517 51662.